ఏలూరు **ఉష్ణోగ్రతలు**

గరిష్ఠం : 33.0

కనిష్ఠం : 24.0



చినవెంకన్న పెళ్లికొడుకాయెనే..

ద్వారకాతిరుమల చినవెంకన్న ఆశ్వయుజ బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వేంకటేశ్వరస్వామి పెండ్లి కుమారునిగా, ఉభయ దేవేరులు పెండ్లి కుమార్తెలయ్యారు. ఆలయ అర్చకులు హారతులివ్వగా, వేద విద్యార్థుల మంత్రోచ్ఛరణల నడుమ శాస్త్రోక్తంగా ఈ తంతును నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వీక్షించారు. ఈనెల 20 వరకు ఉత్సవాలు జరగనున్నాయి. 17న రాత్రి శ్రీవారి కల్యాణం, 18న రథోత్సవం జరుగుతుంది.

- ద్వారకాతిరుమల



ద్వారకాతిరుమలలో కుంకుళ్లమ్మ రథోత్సవం

పాహిమాం.. రాజరాజేశ్వరి


ముగిసిన దసరా నవరాత్రులు

దసరా నవరాత్రులు శనివారంతో ముగిశాయి. విజయదశమి పర్వదినాన అమ్మవారు రాజ రాజేశ్వరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవార్ల సన్నిధిలో శమీ పూజను నిర్వహించారు. నూజివీడులో దసరా ఉత్సవాలు వైభవంగా జరిగాయి. రాజరాజేశ్వరి అలంకారంలో కోట మహిషమ్మ దర్శనమిచ్చింది. పలు చోట్ల అమ్మవార్ల ఊరేగింపును అంగరంగ వైభవంగా నిర్వహించారు. ద్వారకాతిరుమల క్షేత్రదేవత కుంకుళ్లమ్మ రథోత్సవం శనివారం రాత్రి వైభవంగా జరిగింది.



నూజివీడులో రాజరాజేశ్వరి అలంకారంలో కోటమహిషమ్మ







రాజరాజేశ్వరి అలంకరణలో జీలుగుమిల్లి జగదాంబ.. రాట్నాలకుంట రాట్నాలమ్మ.. ఏలూరులో అంబికాదేవి..



ఏలూరు పత్తేబాద నాలుగు గుళ్ల సెంటర్లో అమ్మవారి ఆలయంలో తమ కోరికలను చీటిలో రాసి జమ్మి చెట్టుకు కడుతున్న భక్తులు

‘టెట్’కు 162మంది హాజరు

ఏలూరు అర్బన్, అక్టోబరు 13 : ఉపాధ్యాయ అర్హత పరీక్షల్లో (టెట్) భాగంగా ఆదివారం జరిగిన పరీక్షకు 185 మంది అభ్యర్థులకుగాను 162 మంది హాజరయ్యారని డీఈవో అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు నమోదు కాలేదన్నారు.

కేజీబీవీల్లో బోధనేతర సిబ్బంది నియామకాలకు..

దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు అర్బన్, అక్టోబరు 13 : జిల్లాలోని కుక్కునూరు, వేలేరు, వేలేరుపాడులో వున్న కస్తూరిబా బాలికా విద్యాలయ (కేజీబీవీ)ల్లో ఖాళీగా వున్న బోధనేతర సిబ్బంది పోస్టులను అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన ఏడాది కాలపరిమితికి భర్తీ చేసేందుకు అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు డీఈవో, సమగ్రశిక్ష జిల్లా ఇన్‌చార్జి ఏపీసీ అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు. కుక్కునూరు కేజీబీవీలో అసిస్టెంట్ కుక్, స్వీపర్, స్కావెంజర్ పోస్టులు, వేలేరులో స్వీపర్, వేలేరుపాడులో డే వాచ్‌మన్, స్కావెంజర్ వెకెన్సీలను భర్తీ చేస్తామన్నారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆఫ్‌లైన్ విధానంలో సంబంధిత మండల ఎంఈవో కార్యాలయంలో ఈ నెల 15వ తేదీ సాయంత్రం 5గంటల్లోగా అందజేయాలని సూచించారు. జిల్లాస్థాయి కమిటీ ద్వారా పోస్టుల భర్తీ జరుగు తుందన్నారు.



ఆదివారం రాత్రి ఏలూరు కొత్త బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

తిరుగు ప్రయాణం పాట్లు

- బస్సుల ఏర్పాటులో ఆర్టీసీ వైఫల్యం
- ప్రయాణికుల రద్దీతో బస్టాండ్లు కిటకిట
- అడ్డంగా దోచుకుంటున్న ప్రైవేటు ట్రావెల్స్

ఏలూరు క్రైం, అక్టోబరు 13 : ఆర్టీసీ అధికారులు ప్రయాణికులకు ముందుగా చెప్పిన విధంగా సౌకర్యాల కల్పనలో వైఫల్యం చెందారని విమర్శలు వస్తున్నాయి. జిల్లాలోని జంగారెడ్డిగూడెం, నూజివీడు, ఏలూరు డిపోల నుంచి దసరా పండుగను పురస్కరించుకుని అదనపు సర్వీసులు నిర్వహిస్తామని ప్రయాణికుల రద్దీని బట్టి అదనపు బస్సులు ఏర్పాటు చేస్తామని ముందుగా ప్రకటించినా చర్యల్లో మాత్రం అంతంత మాత్రంగానే కనిపించింది. జంగారెడ్డిగూడెం డిపోలో అయితే ప్రజలకు నరకం చూపించారు. ఆ డిపోలోని డొక్కు బస్సులతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. జంగారెడ్డిగూడెం నుంచి ఏలూరు వెళ్లే బస్సు ఆదివారం సాయంత్రం పంచరు అయి ఆగిపోయింది. జంగారెడ్డిగూడెం నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు బస్టాండులో నరకం చూశారు. ప్రత్యామ్నాయ మార్గాలను వెతుక్కున్నారు. ప్రైవేటు వాహనాల వారు పండుగ రద్దీని పురస్కరించుకుని దూర ప్రాంతాలకు వెళ్ళేవారికి అదనపు రేట్లను పెంచేశారు. ఏలూరులో ప్రయాణికుల రద్దీ విపరీతంగా పెరిగింది. విజయవాడకు అదనంగా 15 నాన్‌స్టాప్ సర్వీసులను అధికారులు ఏర్పాటు చేశారు. దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఇప్పటికే టిక్కెట్లు రిజర్వేషన్ పెట్టుకోవడంతో సమయానికి ప్రయాణికులతో ఆ బస్సులు వెళ్ళిపోయాయి. దూర ప్రాంతాలకు ఎక్కువ బస్సులను కేటాయించడంతో స్థానికంగా సర్వీసులు కొన్ని ఆగిపోయాయి. దీంతో ఇక్కడ ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. దసరా సెలవుకు వచ్చినవారంతా ఆదివారం సాయంత్రానికి తిరుగు ప్రయాణం కట్టడంతో జిల్లాలోని రోడ్లన్నీ రద్దీగా మారాయి.

ప్రైవేటు బస్సుల తనిఖీలు

60 బస్సులపై కేసుల నమోదు

దసరా పండుగను పురస్కరించుకుని కాంట్రాక్టు క్యారేజీ బస్సులు ప్రయాణికుల నుంచి అధిక సొమ్ములు వసూలు చేస్తున్నారన్న సమాచారంతో ఏలూరు ఉప రవాణా కమిషనర్ షేక్ కరీమ్ ఆధ్వర్యంలో ప్రైవేటు బస్సులపై రవాణాశాఖ అధికారులు గత రెండు రోజులుగా స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. అనుమతికి మించి అదనంగా ప్రయాణికులను ఎక్కించుకున్నట్లుగా గుర్తించారు. కాంట్రాక్టు క్యారేజీ బస్సులల్లో సరుకు రవాణా చేస్తున్నట్టు, ప్రయాణికుల నుంచి ఎక్కువ సొమ్ములు వసూలు చేస్తున్నట్టు గుర్తించారన్నారు. అనుమతులు లేకుండానే బస్సులు రోడ్లపైకి రావడంతో మొత్తం మీద 60 బస్సులపై రవాణా అధికారులు కేసులు నమోదు చేశారు. జిల్లాలో విస్తృతంగా ఆదివారం రాత్రి వరకూ ఈ తనిఖీలను నిర్వహించారు.

దరఖాస్తుల కిక్కు..

లక్కు ఎవరిదో!



16 నుంచే అన్నిచోట్లా విక్రయాలు

ఏలూరు జిల్లా మద్యం దరఖాస్తుల స్వీకరణలో సర్కార్‌కే కిక్కెక్కించేలా ఆశించిన దానికంటే అత్యధికంగానే వచ్చిపడ్డాయి. సిండికేట్‌లు ఒకవైపు, కొత్త ముఖాలు ఒకవైపు, తెలంగాణ ప్రాంతం నుంచి వచ్చిన మరికొందరితో కలిపి 144 మద్యం దుకాణాలకు ఏకంగా 5,499 దరఖాస్తులు అందాయి. ప్రతీ దుకాణానికి సరాసరిన 30 దరఖాస్తులు చొప్పున అంచనా కట్టారు. దరఖాస్తు రుసుం రూ.109 కోట్లకు పైగానే ప్రభుత్వానికి చేరింది. నేడు దరఖాస్తు లకు షాపులవారీగా డ్రా పద్ధతి నిర్వహిస్తారు. ఒక్క రోజు వ్యవధిలోనే నిర్దేశించిన రుసుము సదరు వ్యక్తి అందించాల్సి ఉంది. ఈనెల 16 నుంచి కొత్త దుకాణాలు ఆరంభమయ్యేం దుకు వీలుగా ‘కొత్త సరుకు’ సిద్ధం చేశారు.

- ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి

వామ్మో.. ఏం దరఖాస్తులు..

అందరూ ఊహించినట్టుగానే ఈసారి మద్యం వ్యాపారంలో హల్‌చల్ నెలకొంది. ఇంతకుముందున్న విధానాన్ని మార్చి పాత పద్ధతిలోనే ప్రైవేటు వ్యక్తులకు మద్యం విక్రయ నిర్వహణ బాధ్యతను ప్రభుత్వం అప్పచెప్పబోతుంది. జిల్లాలో ఏడు నియోజకవర్గాల పరిధిలో 144 మద్యం దుకాణాలను గుర్తించి దరఖాస్తులు ఆహ్వానించారు. అనూహ్యంగా ఒక్కో షాపునకు సరాసరిన 30 నుంచి 50కు పైగా దరఖాస్తులు అందాయి. దరఖాస్తుల ప్రక్రియ ఆరంభంలో మందకొడిగానే సాగినా చివరికి వచ్చేసరికి పోటీ పెరిగింది. పెద్ద ఎత్తున కొందరు సిండికేట్‌గా ఏర్పడగా ఇంకొందరు వ్యక్తిగతంగా మద్యం దుకాణాల లైసెన్స్ కోసం దరఖాస్తు చేశారు. ఈనెల 11తో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ముగిసింది. అత్యధికంగా చింతలపూడి నియోజకవర్గంలోని కామవరపుకోట, చింతలపూడి, లింగపాలెం, జంగారెడ్డిగూడెంతో కలిపి దాదాపు 24 దుకాణాలకు ఏకంగా 1205 దరఖాస్తులు వచ్చాయి. వాస్తవానికి ఒక్క చింతలపూడిలోనే లైసెన్సు ఫీజును 50 నుంచి 65 లక్షలుగా రెండేళ్ల పాటు నిర్దేశించడం ఇక్కడి అందరినీ ఈవైపుగా ప్రేరేపించింది. ఎక్కడాలేనంతగా ఒక్కో షాపునకు సరాసరిన 50 మంది పోటీ పడినట్టయ్యింది. పోలవరం నియోజకవర్గంలోని 20 దుకాణాలకు 1139 దరఖాస్తులు వచ్చిపడడమే కాకుండా ఒక్కో దుకాణానికి సరాసరిన 57 మంది పోటీ పడినట్టయ్యింది. నూజివీడులో 16 దుకాణాలకు 676, ఉంగుటూరులో 17 దుకాణాలకు 822 దరఖాస్తులు అధికారుల చేతికందాయి. వాస్తవానికి ఒక్కో దుకాణానికి 30 దరఖాస్తులు సరాసరిన అందుతాయని ప్రభుత్వం ఒక అంచనాకు వచ్చి దుకాణాలకు రెండేళ్లకు సరిపడా లైసెన్సు ఫీజును నిర్దేశం చింది. ఈ క్రమంలోనే పట్టణ, గ్రామీణప్రాంతాల్లో మద్యం వ్యాపారంవైపు అత్యధికులు మొగ్గు చూపినట్టు దరఖాస్తుల వెల్లువను బట్టి తెలుస్తోంది. దీనికితోడు గడిచిన ఐదేళ్లల్లో ప్రభుత్వ మద్యం విధానం వైఫల్యం చెందడం, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కొత్త విధానం అమలు.. కొత్తబ్రాండ్‌లకు అదును కనిపించడంతో అసలు ఈ వ్యాపారంతో సంబంధం లేని వారు కూడా రంగంలోకి దిగారు. అధికార కూటమికి చెందిన ఎమ్మెల్యేలం దరినీ ప్రభుత్వం కట్టడి చేసినట్టు ప్రచారం సాగినా ఆ ఛాయలేవీ నియోజకవర్గాల్లో కనిపించనే లేదు.



చలసాని గార్డెన్స్ వద్ద ఏర్పాట్లు

నేడు మద్యం దుకాణాల లాటరీ

- జిల్లాలో దుకాణాలు144.. అందిన దరఖాస్తుల సంఖ్య 5,499
- సర్కార్‌కు ఆదాయం రూ.109.98 కోట్లు
- ఎగబడ్డ పాత, కొత్త ముఖాలు
- తెలంగాణ సరిహద్దున మహా జోష్



ఏలూరు మిని బైపాస్‌లో చలసాని గార్డెన్స్‌లో మద్యం షాపుల లాటరీకి సిద్ధమైన వేదిక

నేడు దుకాణాల లాటరీ

కొత్త మద్యం విధానంలో భాగంగా ప్రభుత్వం నిర్దేశించిన దుకాణాలకు ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారందరికీ లాటరీ పద్ధతిలో నేడు కేటాయిస్తారు. ఏలూరు మినీ బైపాస్ రోడ్డు రామకృష్ణాపురంలో ఉన్న చలసాని గార్డెన్స్ ప్రాంగణంలో సోమవారం ఉదయం 8 గంటల నుంచి కలెక్టర్ వెట్రిసెల్వి పర్యవేక్షణలో లాటరీ ప్రక్రియను నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా యంత్రాంగం భారీ ఏర్పాట్లు చేసింది. ఎవరైతే దుకాణం పొందారో ప్రభుత్వ పరంగా అన్ని నియమ నిబంధనలు పూర్తి చేసిన తర్వాత 16వ తేదీ నుంచే ఆయా దుకాణాల్లో మద్యం విక్రయానికి అనువుగా ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే జిల్లాలోని వివిధ డిపోల్లో భారీగా మద్యంను నిల్వ చేసి రెడీగా ఉంచారు.

దుకాణం.. బంగారం

మద్యం దుకాణం ఒక్కటి అంటే ఒక్కటి వస్తేచాలు తమ పంట పండి నట్టేనని భావించి కొందరు ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు సైతం తమ భార్యలు, అన్నదమ్ములు, బంధువుల పేరిట దుకాణాలకు దరఖాస్తులు చేసినట్టు సమాచారం. ఈక్రమంలోనే ఎక్కడైతే మద్యం విక్రయానికి డిమాండ్ ఉంటుందో ఆవైపుగా దేవుడి మీద భారం వేసి మరీ దరఖాస్తు చేసేశారు. ఒక్క దుకాణం వస్తే చాలు బంగారం వచ్చినట్టేననే భావనలో వీరంతా చెలరేగిపోయారు. ఈ పరిస్థితి పోలవరం దగ్గర నుంచి నూజివీడు వరకు కనిపించింది.

నియోజకవర్గం	షాపుల సంఖ్య	అందిన దరఖాస్తులు	సరాసరిన ఒక్కో షాపునకు
ఏలూరు	26	491	19
దెందులూరు	15	293	20
చింతలపూడి	24	1205	50
పోలవరం	20	1139	57
ఉంగుటూరు	17	822	48
నూజీవీడు	16	676	42
కైకలూరు	21	588	28
గోపాలపురం	5	285	57
మొత్తం	144	5499	38

ఆ రెండింటిలో తక్కువెందుకో..?

ఏలూరు, దెందులూరు నియోజక వర్గాల్లో అందిన దరఖాస్తులు మిగతా నియోజకవర్గాల కంటే చాలా అత్యల్పంగా ఉన్నాయి. ఏలూరులో 26 దుకాణాలకు కేవలం 495 దరఖాస్తులే వచ్చాయి. అంటే సరాసరిన ఒక్కో దుకాణానికి 19 దరఖాస్తులే అందినట్టయ్యింది. ఏలూరు నగరంలో మద్యం వినియోగం రోజువారీ లెక్కింపులో మిగతా ప్రాంతాల కంటే అత్యధికం. ఇక్కడ ఉన్న జనాభా, కార్పొరేషన్ విస్తృతి ప్రకారం దుకాణాలు కేటాయించారు. ఇంకోవైపు సమాంతరంగా బార్లు కొనసాగుతూనే ఉంటాయి. అయినప్పటికి ఇక్కడ మాత్రం ఓ అడుగు వెనక్కి వేశారు. ఇప్పటికే ఇక్కడ సిండికేట్‌లు బలంగా ఉండడం, మద్యం వ్యాపారంలో దశాబ్దాల కాలంగా రాటుతేలినవారు ఉండడంతో దరఖాస్తుదారులు వెనుకంజ వేసి ఉంటారని విస్తృత ప్రచారం సాగుతోంది. దెందులూరు నియోజకవర్గంలోను 15 దుకాణాలు ఉండగా 293 దరఖాస్తులు అందాయి. సరాసరిన ఒక్కో దుకాణానికి కేవలం 20 దరఖాస్తులు మాత్రమే అందాయి.ఈ రెండు నియోజక వర్గాల్లోను ఈ పరిస్థితిని గమనించిన చాలామంది కొన్ని కారణాలతోనే వెనుకంజ వేశారని భావిస్తున్నారు.

పోటాపోటీ..

మద్యం దుకాణాల వ్యవహారంలో ఎక్కడికక్కడ ఎవరంతట వారుగా పోటీలు పడ్డారు. సిండికేట్‌లుగా ఏర్పడి కొందరు 20 నుంచి 50 దుకాణాల వరకు పదుల సంఖ్యలో దరఖాస్తులు విసిరారు. వాస్తవానికి తెలంగాణ సరిహద్దున ఉన్న కుక్కునూరు, వేలేరుపాడు, జీలుగుమిల్లి వంటి మండలాల్లో ఉన్న దుకాణాలకైతే ఊహించని స్థాయిలో దరఖాస్తులు వచ్చిపడ్డాయి. ఒకవేళ మద్యం ధరలు తెలంగాణ కంటే మన రాష్ట్రంలో ఒకింత తక్కువగా నమోదయ్యే అవకాశాలు ఉండడం, దీని దృష్ట్యా తెలంగాణవాసులు కూడా మన రాష్ట్ర దుకాణాలవైపు మొగ్గుచూపే అవకాశం ఉందని భావించి మరీ ఆయా దుకాణాల కోసం పోటీలు పడ్డారు. ఇంకోవైపు ఇతర దుకాణాలకు కూడా తెలంగాణ మద్యం వ్యాపారంలో ఇప్పటికే ఆరితేరిన కొందరు, సిండికేట్‌లో ఉన్న మరికొందరు ఏలూరు జిల్లాలోని కొన్ని దుకాణాలకు దరఖాస్తులు చేశారు. కైకలూరు, జంగారెడ్డిగూడెం వంటి ప్రాంతాల వైపు తెలంగాణ అనుకూలురు తొంగి చూశారు. ఇదేకాకుండా కొత్త మద్యం పాలసీలో ఒక మండలానికి కేటాయించిన దుకాణాలు ఏఏ ప్రాంతాల్లో ఉండాలన్న నిర్దేశం లేకపోవడంతో దరఖాస్తు చేసుకున్న వారు రెచ్చిపోయినట్టు చెబుతున్నారు.



చలసానిగార్డెన్స్‌లో ఆదివారం రాత్రి లాటరీ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ, జేసీ , ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్

లాటరీకి సర్వం సిద్ధం

ఏలూరు క్రైం : ఏలూరు నగరంలోని మినీ బైపాస్‌లో గల చలసాని గార్డెన్స్‌లో సోమవారం మద్యం దుకాణాలకు లాటరీ ప్రక్రియను నిర్వహించనున్న నేపథ్యంలో అక్కడ ఏర్పాట్లను ఆదివారం రాత్రి జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్, జేసీ ధాత్రిరెడ్డి, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీలత, ఎక్సైజ్ ఎస్పీ ఆవులయ్య ఇతర అధికారులు పరిశీలించారు. ఇద్దరు డీఎస్పీలు, ఐదుగురు సీఐలు, 16 మంది ఎస్‌ఐలు, ఏఎస్ నుంచి హోంగార్డు వరకు 88 మంది, స్పెషల్ పార్టీ పోలీసులు 10 మంది మొత్తం 119 మందితో బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఏలూరులో వాహనాల దారి మళ్లింపు

మద్యం దుకాణాల లాటరీ నేపథ్యంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం చర్యలు చేపట్టినట్టు డీఎస్పీ శ్రావణ్ కుమార్ తెలిపారు. సోమవారం ఉదయం ఆరు గంటల నుంచి లాటరీ ముగిసే వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమలు అవుతాయన్నారు. అధికారులు చలసాని గార్డెన్స్ అవుట్ సైడ్‌ను పార్కింగ్ స్థలంగా వినియోగించాలని, ఉషా బాల ఖాళీ స్థలం, క్రాంతి ఫంక్షన్ హాల్, గ్రాండ్ కృష్ణా ఫంక్షన్ హాల్ వద్ద వాహనాలు నిలుపుదల చేసుకోవాలన్నారు. విజయవాడ వైపు నుంచి వచ్చే వాహనాలు సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీ వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి మీదుగా సత్రంపాడు, కొత్త బస్టాండ్ మీదుగా, ఏలూరు నుంచి మినీ బైపాస్‌లో వెళ్లే వాహనాలు జూట్‌మిల్లు వద్ద నుంచి ఫ్లైఓవర్ మీదుగా ఫైర్‌స్టేషన్ మీదుగా వెళ్లాలని సూచించారు. పడమరలాకుల వద్ద నుంచి వాహనాలను లోబ్రిడ్జిలో నుంచి దారి మళ్లిస్తారు. గ్రీన్ సిటీకి వెళ్లే వాహనాలు సత్రంపాడు రోడ్డులోని నేరెళ్ళ పక్కన ఉన్న రోడ్డులో నుంచి మినీ బైపాస్ రోడ్డుకు వెళ్లాలని సూచించారు.

గుర్తింపు కార్డు తెచ్చుకోండి : ఎక్సైజ్ ఎస్పీ

మద్యం షాపులకు నిర్వహించే లాటరీ ప్రక్రియ కార్యక్రమానికి వచ్చే దరఖాస్తుదారులు గుర్తింపు తెచ్చుకోవాలని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ (ఎక్సైజ్ ఎస్పీ) ఆవులయ్య తెలిపారు. దరఖాస్తుదారులు ఎంట్రీపాస్ ఐడీ ప్రూఫ్‌గా ఓటర్ గుర్తింపు కార్డుకాని, డ్రైవింగ్ లైసెన్సు, పాస్‌పోర్టు, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, పాన్‌కార్డు వంటివి తెచ్చుకోవాలన్నారు. దరఖాస్తుదారుడు తనకు బదులుగా వేరొకరిని పంపితే వచ్చే వ్యక్తి సెల్ఫ్ డిక్లరేషన్, దరఖాస్తు దారుని ఆధార్ కార్డు, వచ్చే వ్యక్తి ఆధార్‌కార్డు తీసుకు రావాలన్నారు.

పొంచి ఉన్న

వానగండం

ముమ్మరంగా వరికోతలు.. రైతుల్లో ఆందోళన

ఏలూరు సిటీ, అక్టోబరు 13 : జిల్లాలో గత నాలుగు రోజులుగా అడపాదడపా వివిధ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. పగటి పూట ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నా మధ్యాహ్నం నుంచి సాయంత్రం సమయాల్లో వర్షాలు కురుస్తున్నాయి. బంగాళాకాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రాష్ట్రంలో మరో రెండు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని, ఈ వర్షాల ప్రభావం కోస్తా ప్రాంతాల పైనే ఎక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ చెబుతోంది. ఇప్పటికే సార్వా వరి సాగులో చివరి అంకం కొనసాగుతోంది. ఈ దిశలో వరి కోతలు ప్రారంభమైన ప్రాంతాల్లో రైతులు పంట తడిసి పోతుందనే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గడచిన 24 గంటల్లో అత్యధికంగా కొయ్యలగూడెం మండలంలో 22.4 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. పెదపాడులో 17.4, ముదినేపల్లిలో 12.2, లింగపాలెంలో 8.6, ఉంగుటూరులో 7.4, జంగారెడ్డిగూడెంలో 5.4, ద్వారకాతిరుమలలో 5.4 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లాలో సరాసరి వర్షపాతం 3.6 మి.మీ నమోదైంది.

కొత్తశకానికి నాంది

- నేటి నుంచే పల్లె పండుగ వారోత్సవాలు ప్రారంభం.. 20వ తేదీ వరకు నిర్వహణ
- రూ.121.57 కోట్లతో 1917 పనులు
- ఆగస్టు 23న నిర్వహించిన గ్రామ సభల్లో తీర్మానించిన పనులకే ప్రాధాన్యత
- ఓగిరాల తండా లో మంత్రి పార్థసారథి సీసీ రహదారి పనులకు శంకుస్థాపన

ఏలూరు సిటీ, అక్టోబరు 13 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పల్లె పండుగ వారోత్సవాలు కార్యక్రమాలు ఈనెల 14వ తేదీన ప్రారంభం కానున్నాయి. ఈ వారోత్సవాలు ఈనెల 20వ తేదీ వరకు నిర్వహించడానికి జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామాల్లో సీసీ రహదారులు, డ్రెయిన్ల పనులతో పాటు ఉపాధి కూలీలకు 100 రోజులు పనులు కల్పించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో 547 గ్రామ పంచాయతీలు ఉండగా ఆయా పంచాయతీల్లో ఆగస్టు 23న నిర్వహించిన గ్రామ సభల్లో చేసిన తీర్మానాలకు సంబంధించి ఆయా గ్రామాల్లో పనులను కేటాయించారు. గ్రామీణ కుటుంబాలకు వారు నివాసముంటున్న గ్రామాల్లో ఏడాదిలో కనీసం 100 రోజులు వేతన ఉపాధి కల్పించాలని నిర్ణయించారు. సీసీ రహదారులతో పాటు బీటీ రోడ్లు, ఫాం పాండ్స్, గోకులాలు, ట్రెంచ్‌లు, డ్రెయిన్స్, హార్టీకల్చర్, తదితర పనులను నిర్వహించనున్నారు. ముఖ్యంగా గ్రామాల్లో సీసీ రహదారులు, డ్రెయిన్స్ ఏర్పాటు చేయడానికి ఈ పల్లె పండుగ వారోత్సవాల్లో ఆయా గ్రామాల్లో ప్రజా ప్రతినిధుల సమక్షంలో శ్రీకారం చుట్టనున్నారు. జిల్లాలో రూ. రూ.121.57 కోట్లతో 1917 పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఈ వారోత్సవాల్లో ఆయా నియోజకవర్గాల్లోని



ప్రజా ప్రతినిధులు, మండల ప్రజా ప్రతినిధులు, గ్రామాల్లోని ప్రజా ప్రతినిధులతో పాటు ప్రజలు పాల్గొంటారు. గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా ఈ ఉపాధి నిధులతో పనులు చేపట్టే గ్రామాల్లో సభలు నిర్వహించి ప్రజలు, ప్రజా ప్రతినిధులను భాగ స్వాములు చేయడం ద్వారా మరింత పారదర్శకంగా ఈ పనులు చేపట్టాలని నిర్ణయిం చారు. ఈ పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ, సమా చార శాఖ మంత్రి కొలుసు పార్థ సారథి ఈ నెల 14 వ తేదీ ఉందయం 8 గంటలకు నూజివీడు రూరల్ మండ లం ఓగిరాల తండా గ్రామంలో సీసీ రహదారుల శంకు స్థాపన కార్యక్రమంలో పాల్గొని ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. అనంతరం 8.30 గంటలకు వెంకటాయపాలెంలో, మధ్యాహ్నం 12 గంటలకు మిట్టగూడెంలో సీసీ రహదారుల శంకుస్థాపన కార్యక్రమంలోను ఆయన పాల్గొంటారు.

వరుడైన చిన్నతిరుమలేశుడు

ఘనంగా ప్రారంభమైన ఆశ్వయుజ బ్రహ్మోత్సవాలు

ద్వారకాతిరుమల, అక్టోబరు 13: ముగ్ధమంద హాసంతో శ్రీదేవి, భూదేవీల నడుమ కొలువైన చిన్నతిరుమలేశుడు పెండ్లి కుమారునిగా ముస్తాబయ్యారు. చిరునగవులు చిందిస్తూ... అపురూపలావణ్యాలతో బుగ్గన చుక్కలు, పట్టు పీతాంబరాలను ధరించి విశేష అలంకారాల్లో కొలువైన ఉభయదేవేరులు పెండ్లి కుమార్తెలయ్యారు. అర్చకుల వేదమంత్రోచ్ఛరణలు, భక్తుల గోవిందనామ స్మరణలు, మేళతాళాలు, మంగళవాయిద్యాలు తోడైన వేళ.. ఈ అద్భుత వేడుకను వీక్షించిన భక్తజనులు పరవశించారు. శ్రీవారి ఆలయ నిత్యకల్యాణ మండప ఆవరణ ఆదివారం ఉదయం ఇందుకు వేదికైంది. ప్రత్యేకంగా అలంకరించిన ఈ వేదికపై ఏర్పాటు చేసిన సువర్ణ సింహాసనంపై స్వామి, అమ్మవార్ల కల్యాణ మూర్తులను ఉంచి ఆలయ అర్చకులు హారతులిచ్చి ఈ తంతును వేద విద్యార్థుల మంత్రోచ్ఛరణల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ఈవో ఎన్వీఎస్ఎన్ మూర్తి అర్చకులు, పండితులకు దీక్షా వస్త్రాలను అందచేసి, ఆ తరువాత స్వామివారి తీర్థ, ప్రసాదాలను స్వీకరించారు.



స్వామి, అమ్మవార్లను అట్టహాసంగా నిత్యకల్యాణ మండప వేదిక వద్దకు తీసుకొస్తున్న దృశ్యం, శ్రీవారు, అమ్మవార్ల కల్యాణమూర్తులు(ఇన్‌సెట్)

శ్రీమహావిష్ణువుగా చినవెంకన్న



శ్రీమహావిష్ణువుగా చినవెంకన్న భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీవారి ఆశ్వయుజమాస బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీవారు ప్రతీ రోజూ ఓ ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తారు. ఇందులో తొలిరోజైన ఆదివారం శంఖు, చక్ర గదా ధారియై ఉభయదేవేరులతో విశేష పుష్పాలంకారాల్లో మహా విష్ణువు అలంకారంలో ఉన్న స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించి తరించారు.
- ద్వారకాతిరుమల

కళకళలాడిన శ్రీవారి క్షేత్రం



వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లో వేచిఉన్న భక్తులు, భవానీలు

ద్వారకాతిరుమల, అక్టోబరు 13: విజయదశమి పర్వదినాల నేపథ్యంలో భవానీ దీక్షాదారులు, భక్తులతో చినవెంకన్న క్షేత్రం ఆదివారం కిటకిటలాడింది. అందరికీ వారాంతపు సెలవు రోజు కావడం, అలాగే విజయవాడలో దుర్గమ్మను దర్శించిన వివిధ ప్రాంతాలకు చెందిన వారంతా మార్గమధ్యలో ఉన్న శ్రీవారి క్షేత్రానికి విచ్చేశారు. ఉదయం నుంచే ఆలయానికి యాత్రికులు, భవానీల రాక ప్రారంభమైంది. దీంతో అన్ని విభాగాలు సందడిగా మారాయి, వేలాది మంది యాత్రికులు, భవానీ దీక్షాదారులు క్షేత్రానికి చేరుకుని తమ మొక్కుబడులు తీర్చుకున్నారు. దాదాపు 15 వేల మంది పైబడి భక్తులు ఆలయానికి వచ్చినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. అలాగే శ్రీవారి ఉచిత దర్శనానికి గంటల తరబడి సమయం పట్టింది.

క్షేత్రంలో నేత్రపర్వంగా శమీ పూజ

రాజాధిరాజ వాహనంపై శ్రీవారు

ద్వారకాతిరుమల, అక్టోబరు 13: రాజాధిరాజ వాహనంపై ఉభయదేవేరులతో కొలువుదీరిన చినవెంకన్న విజయదశమి పర్వదినాన శమీపూజ నిమిత్తం నృశింహసాగరం వద్ద నున్న దసరా మండపానికి వెళ్లి పూజలందుకున్నారు. ముందుగా ఆలయంలో రాజాధిరాజ వాహనంలో స్వామి, అమ్మవార్లను ఉంచి అర్చకులు ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాలు అర్చకుల వేదమంత్రోచ్ఛరణల నడుమ క్షేత్రపుర వీధులలో భక్తుల హారతులు అందుకుంటూ నృశింహసాగరం వద్దనున్న మండపం వద్దకు చేరుకున్నారు. అక్కడ అలంకరించిన మండపంలో స్వామి, అమ్మవార్లను ఉంచి ముందుగా ఉన్న జమ్మి చెట్టుకు అర్చకులు విశేషపూజలు చేసి హారతులిచ్చారు. విజయముహూర్త సమయంలో శమీ వృక్షం అంటే జమ్మిచెట్టుకు పూజ చేస్తే సకల దోషాలు హరిస్తాయని, పాండవులు అజ్ఞాతవాసానికి ముందు తమ ఆయుధాలను జమ్మిచెట్టుపైనే ఉంచారన్నది భారతం చెప్పే కథ. పూజ అనంతరం భక్తుల నుంచి హారతులందుకుంటూ శ్రీవారు ఆలయానికి చేరుకున్నారు.



నృశింహసాగరం వద్ద జమ్మిచెట్టుకు పూజలు చేసి హారతులిస్తున్న అర్చకులు

ఉండి నియోజకవర్గ అభివృద్ధికి రూ.కోటి విరాళం



శ్రీవిజయలక్ష్మి ఆక్వా ట్రేడర్ షాపును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రఘురామ, రామరాజు, మస్తాన్‌రావు, సత్యనారాయణరాజు తదితరులు

ఉండి అక్టోబరు 13: ఉండి నియోజకవర్గ డ్రెయినేజీ, పంట కాలువలు అభివృద్ధికి రూ.కోటి విరాళం అందిస్తున్నట్లు రాజ్యసభ మాజీ సభ్యుడు బీఎంఆర్ సంస్థ ఎండీ బీద మస్తాన రావు ప్రకటించారు. పార్లమెంటులో రఘురామ కృష్ణరాజు తాను మంచి మిత్రులుమంటూ ఆయన గుర్తు చేశారు. ఆక్వా రైతుల సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజు, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు తదితరులు అభినందించారు. అనంతరం ఆక్వా రైతు, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు పేరిచర్ల కృష్ణంరాజు(బాలరాజు) ఏర్పాటు చేసిన విజయ ఎంటర్ ప్రైజెస్ ఆక్వా ఏజెన్సీని ఎమ్మెల్యే కనుమూరు రఘురామరాజు, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, మాజీ రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్ రావు, మాజీ టీడీపీ కన్వీనరు గొట్టుముక్కల సత్యనారాయణరాజు చేతుల మీదుగా శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రఘురామ మాట్లాడుతూ ఆక్వా రైతులకు అందుబాటులో బీఎంఆర్ ఫీడ్‌ను ఉంచడం శుభసూచకమన్నారు. మంతెన రామరాజు మాట్లాడుతూ ఆక్వా రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. గండ్రాజు నరసింహరాజు, కరిమెరక నాగరాజు, కందుల బలరాం, తోట రాము, యడవల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

హోరాహోరీగా చెడుగుడు పోటీలు



నూజివీడు టౌన్, అక్టోబరు 13: దసరా ఉత్సవాలను పురస్కరించుకుని నూజివీడు డీఏఆర్ కళాశాలలో అఖిలభారత చెడుగుడు పోటీలను నూజివీడు స్పోర్టింగ్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ప్రారంభించారు. ఐదు పురుషుల జట్లు, ఐదు మహిళా జట్లు హాజరు కాగా, తొలిరోజు క్రీడా పోటీలు నువ్వా నేనా అన్నట్టు సాగాయి. తొలిరోజు పురుషుల జట్ల మధ్య రెండు క్రీడాపోటీలను నిర్వహించగా, తొలి చెడుగుడు పోటీల్లో ఎన్టీఆర్ జిల్లా, పశ్చిమగోదావరి జట్లు తలపడ్డాయి. ఇందులో 51-22 స్కోరుతో పశ్చిమగోదావరిపై ఎన్టీఆర్ జిల్లా జట్టు గెలుపొందగా ఇక రెండో క్రీడా పోటీ విజయనగరం, శ్రీకాకుళం జట్ల మధ్య సాగింది. 38-35 స్కోరుతో శ్రీకాకుళంపై విజయనగరం జట్టు విజయం సాధించింది. అనంతరం నిర్వహించిన మహిళా చెడుగుడు పోటీల్లో శ్రీకాకుళం, గుంటూరు జట్లు తొలుత పోటీ పడ్డాయి. ఇందులో 33-20 స్కోరుతో గుంటూరుపై శ్రీకాకుళం విజయం సాధించగా, 2వ పోటీ కృష్ణా, విజయనగరం జట్ల మధ్య జరుగగా 22-35 స్కోరుతో కృష్ణాపై విజయనగరం విజయం సాధించింది. ఇక రెండో రోజు క్రీడా పోటీలు వర్షం కారణంగా దాదాపు రెండు గంటలు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి.

వైదిక విధుల్లో అర్చకులకు వెసులుబాటు

» ఇతరుల జోక్యానికి తిలోదకాలు » తుది నిర్ణయం అర్చకులదే » కూటమి ప్రభుత్వం నిర్ణయం » జీవో విడుదల

అర్చన అంటే పూజ.. అర్చకుడు, పూజారి పర్యాయపదాలు. పుర అంటే ఎదుట వ్యక్తికి రానున్న కాలంలో ఉండబోయే పరిస్థితి దర్శించి శాస్త్ర సమ్మతంగా చెప్పేవాడు పురోహితుడు. ఇంతటి ప్రాముఖ్యత ఉన్న పురోహితులకు ఐదేళ్లలో ప్రాధాన్యత చాలా వరకు తగ్గింది. ఆలయాల్లో రాజకీయ జోక్యాలు పెరిగిపోయి పూజలు మమ అనిపించే పరిస్థితి. ఇక నుంచి దేవాలయాలకు సంబంధించిన ఏదైనా వైదిక పూజలు, యాగాలు వంటి కార్యక్రమాలలో అర్చకులదే తుది నిర్ణయం. గత ప్రభుత్వ హయాంలో ఆలయాల్లో ఆగమ విషయాలను పక్కనపెట్టి కార్యక్రమాలు జరిగిన నేపథ్యంలో వాటిని సరిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో ఇక నుంచి ఉత్సవాల నిర్వహణలో అర్చకుల నిర్ణయమే కీలకంగా మారింది. పూజల విషయంలో రాజకీయ నాయకుల ప్రమేయం కూడా ఎక్కువ కావడంతో అర్చకులు నామమాత్రంగా ఉంటున్నారు. అధికారులు, రాజకీయ నాయకులు చెప్పినట్లుగా నడుచుకోనే పరిస్థితి ఉంది. ఇక నుంచి అటువంటి పరిస్థితికి స్వస్తి పలికింది కూటమి ప్రభుత్వం.



భీమవరం టౌన్, అక్టోబరు 13 : దేవాలయాల్లో పూజలు, సహా ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణ విషయంలో కూటమి ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ఇక నుంచి ఆయా దేవాలయాల్లో వైదిక కార్యక్రమాలలో ఇతరుల జోక్యం లేకుండా అర్చకులకు స్వయం ప్రతిపత్తి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో దాదాపు 500 వరకు ఉన్న దేవాలయాలకు ఈ విధానం అమల్లోకి రానుంది. దేవదాయ కమిషనర్ సహా ఏ స్థాయి అధికారి అయినా వైదిక విధుల్లో జోక్యం చేసు కోకూడదని ప్రభుత్వం విడుదల చేసిన జీవోలో ఆదేశాలు జారీ చేసింది. అర్చకులకు విశేష అధికారాలు కట్టబెట్టిన ప్రభుత్వం. పూజలు, సేవలు, యాగాలు, కుంభాభిషేకాల వంటి వాటిల్లో అధికారుల పాత్రని పరిమితం చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఆయా దేవాలయాల ఆగమం ప్రకారం వైదిక విధులు నిర్వహించుకునేలా అర్చకులకు వెసులుబాటు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆధ్యాత్మిక విధుల విషయంలో అర్చకులదే తుది నిర్ణయమని స్పష్టం చేసింది.

వైదిక కమిటీలు ఏర్పాటు

ఇక ఆలయాల్లో వైదిక కమిటీలు ఏర్పాటుకు చర్యలుతీసుకోవాలని జీవో పేర్కొంది. ఏదైనా ఆధ్యాత్మిక విషయాల్లో ఏర్పాటు చేసి వైదిక కమిటీలో ఏకాభిప్రాయం కుదరకుంటే సంబంధిత ఆగమ పీఠాధిపతుల సలహాలు తీసుకోవాలని జీవోలో వెల్లడించింది. ఆయా దేవాలయాల ఆగమ శాస్త్రాల ప్రకారమే వైదిక విధులు నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఐతే చిన్న దేవాలయాలకు సంబంధించి వైదిక కమిటీ ఏర్పాటు గ్రామస్థాయిలో ఏర్పాటు చేసుకోవాలా లేదా మండల స్థాయిలో ఉంటుందా అనేది స్పష్టం లేకపోవడంతో కొంత గందరగోళం నెలకొంది. ఇప్పటి వరకు ఇటువంటి కమిటీలు లేకపోవడంతో ఏదైనా కార్యక్రమాలు నిర్వహించాలంటే ఆలయ ఈవోలదే నిర్ణయంగా మారింది. ఇక నుంచి ఉత్సవాలకు సంబంధించి అధికారులు పాత్ర నామమాత్రంగా ఉంటుంది. ప్రస్తుతం జిల్లాలోని దేవాలయాలకు ధర్మకర్తల మండళ్ళు ఇంకా ఏర్పాటు కాలేదు. అవి వచ్చిన తరువాత ఎలా ఉంటుందనే దానిపై ప్రస్తుతం చర్చ సాగుతోంది.

సముచితంగా ఉంది



దేవాలయల్లో పూజలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా వైదిక కమిటీలను ఏర్పాటు చేయడం అభినందనీయం. అర్చకులకు తుది నిర్ణయంగా నిర్ణయించడం సముచితంగా ఉంది.
- పెద్దింటి పురుషోత్తమాచార్యులు, అర్చక సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు

సమగ్రాభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే ఆరిమిల్లి

నేటి నుంచి గ్రామదర్శిని



తణుకు, అక్టోబరు 13 : నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు, పట్టణం అభివృద్ధే తన లక్ష్యమని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. 2014 నుంచి 2019 వరకు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనూ ప్రతి గ్రామం, పట్టణం తిరిగి అనేక సమస్యలు పరిష్కరించానని, ఇపుడు అదే తరహాలో సోమవారం నుంచి అత్తిలి మండలం కేఎస్‌గట్టు నుంచి గ్రామదర్శిని కార్యక్రమానికి శ్రీకారం చుట్టాతానన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. వాటిని పరిష్కరించాలనేది ప్రధానుద్దేశ్యం అని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఈ గ్రామదర్శినిలో అన్ని శాఖలు అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. స్థానికంగా ప్రజలు నుంచి వచ్చిన వినతులును బట్టి అక్కడికక్కడే పరిష్కారం అయ్యే వాటిని పరిష్కరిస్తామని, మిగిలిన వాటిని పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని తణుకు, అత్తిలి, ఇరగవరం, రూరల్ మండలంలోని 48 గ్రామాలతో పాటు, 34 వార్డుల్లో పర్యటన సాగుతుందన్నారు. పర్యటనలో సమస్యలు పరిష్కరించడమే ప్రధాన అజెండా అని ఎమ్మెల్యే తెలిపారు. తణుకు, అత్తిలి, ఇరగవరం, మండలాలకు సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి ఇప్పటికే రూ.ఏడు కోట్లు ఎన్ఆర్ఈ జీఎస్ నిధులు మంజూరు అయ్యాయన్నారు. తణుకునకు రూ.17.7 కోట్లు, అత్తిలికి రూ.290.7 కోట్లు, ఇరగవరంనకు రూ.234.6 కోట్లు చొప్పున మంజూరయ్యాయని త్వరలోనే పనులు ప్రారంభిస్తామని ఎమ్మెల్యే ఆరిమిలి వెల్లడించారు.

పోలీసుల మంటూ.. డబ్బులు వసూళ్లు

మొగల్తూరు, అక్టోబరు 13 : పోలీసులమని చెప్పి డబ్బులు వసూలు చేసిన ఘటనలో ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ జి.వాసు ఆదివారం తెలిపారు. పేరుపాలెంసౌత్‌కి చెందిన మండా శ్రీనివాస్, అతని సోదరుడు అనిల్ కుమార్ ఈ నెల 11న బీచ్ రోడ్డులో మాట్లాడుకుంటుండగా అదే సమయంలో ముగ్గురు వ్యక్తులు రెండు మోటార్ సైకిళ్లపై వచ్చి తాము పోలీసులమని వారి నుంచి రూ.500లు బలవంతంగా వసూలు చేశారు. దీంతో వారికి అనుమానం వచ్చి వారిని మొగల్తూరు పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి పోలీసులకు అప్పగించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా నిజమేనని తేలడంతో భీమవరం మండలం రాయలంకు చెందిన దవులూరి సువర్ణరాజు, అదే గ్రామం దిరుసుమర్రుపేటకు చెందిన వర్ధనపు ప్రసాద్, భీమవరం మండలం శ్రీరామపురంనకు చెందిన మండా కిరణ్ కుమార్‌ను శనివారం అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రెండు మోటార్ సైకిళ్ళు సెల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ముద్దాయిలను న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా రిమాండ్ విధించినట్టు ఎస్ఐ తెలిపారు. ముద్దాయిలు ముగ్గురు ఒక మెరైన్ కంపెనీలో సెక్యూరిటీ గార్డులుగా పని చేస్తున్నారని పోలీసులు పేర్కొన్నారు.

తల్లి మరణాన్ని తట్టుకోలేక ఆగిన కుమారుని గుండె

పెదవేగి, అక్టోబరు 13 : వృద్ధాప్యంతో మృతి చెందిన తల్లికి కర్మకాండలు పూర్తి చేసిన కుమారుడు రోజు గడవకముందే గుండె ఆగి మరణించాడు. ఒక రోజు వ్యవధిలో తల్లీకుమారులు మృతిచెందడంతో ఆ గ్రామంలో విషాదం నెలకొంది. వివరాల్లోకి వెళ్తే.. పెదవేగి మండలం కూచింపూడికి చెందిన ఏనుగు గంగమ్మ(80) శుక్రవారం ఉదయం మృతి చెందింది. ఆమె కుమారుడు వెంకటేశ్వరరావు అంత్యక్రియలు నిర్వహించాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన ప్పటి నుంచి ఎవ్వరితోనూ మాట్లాడకుండా మౌనంగా రోదిస్తున్నాడు. ఆ రాత్రి నిద్రించిన వెంకటేశ్వరరావు శనివారం ఉదయం గుండెపోటుకు గురై మృతి చెందాడు. దీంతో గ్రామంలో విషాదం నెలకొంది. రోజు వ్యవధిలో తల్లీ, కుమారుడు మృతి చెందడంతో బంధువులు విషాదంలో మునిగారు. చిన్నతనం నుంచి తల్లి గంగమ్మ అంటే ఎనలేని ప్రేమను పెంచుకున్న కుమారుడు వెంకటేశ్వరరావు(50) తల్లి మృతిని జీర్ణించుకోలేక గుండెపోటుకు గురై మృతి చెందాడని గ్రామస్తులు తెలిపారు. వెంకటేశ్వరరావు నాలుగేళ్ల వయస్సులోనే తండ్రిని కోల్పోగా, అప్పటినుంచి తల్లి, కుమారుడు ఒకరి కొకరుగా జీవించారని, వెంకటేశ్వరరావుకు పెళ్ళై ఇద్దరు పిల్లలకు తండ్రి అయినా.. తల్లితో తన అనుబంధాన్ని వీడలేదని, ఇప్పటికీ తల్లి మాటే వేదంగా ఉండేవాడని గ్రామస్తులు తెలిపారు. అలాంటి తల్లి వృద్ధాప్యంతో మృతి చెందినా ఆ నిజాన్ని తట్టుకోలేక తెల్లారేసరికి తల్లి దగ్గరకే వెళ్ళాడని గ్రామస్తులు విచారం వ్యక్తం చేస్తున్నారు.



వెంకటేశ్వరరావు(ఫైల్)

క్రైమ్ కార్నర్

వేర్వేరు ఘటనలలో పలువురి మృతి

విద్యుదాఘాతానికి యువకుడి మృతి



రమేష్

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 13: విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ కారణంగా యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని ముత్యాలంబపురంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ముత్యాలంబపురం అమ్మవారి ఆలయ మాజీ చైర్మన్ అన్నంనీడి శ్రీనివాస్ కుమారుడు అన్నంనీడి రమేష్ (32) అమ్మవారి ఊరేగింపు సందర్భంగా కాలువలో తల స్నానం చేసి అమ్మవారిని రథం ఎక్కించారు. అనంతరం ఇంటి దగ్గర ఉన్న బడ్డి దగ్గర షార్ట్ సర్క్యూట్ అవుతుందని చూసేందుకు స్విచ్‌లు చెక్ చేస్తుండగా విద్యుత్ షాక్ కొట్టడంతో కింద పడి పోయాడు. వెంటనే స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. దీంతో అమ్మవారి ఊరేగింపు నిలుపుదల చేశారు. రమేష్‌కు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

పెదవేగి మండలంలో..

పెదవేగి, అక్టోబరు 13 : జేసీబీని నీటితో శుభ్రం చేస్తుండగా ప్రమాదవ శాత్తు విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడు మృతి చెందాడు. పెదవేగి ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం జగన్నాథపురానికి చెందిన మాత్రపు వెంకటేశ్వరరావు అదే గ్రామానికి చెందిన సమీప బంధువుకు చెందిన జేసీబీపై పని చేస్తున్నాడు. ఆదివారం ఉదయం జేసీబీని మోటారు ఉపయోగించి పైపు ద్వారా నీటితో శుభ్రం చేస్తున్నాడు. ఈ సమయంలో మోటారు నుంచి నీటి ద్వారా విద్యుత్ ప్రవహించి, మాత్రపు వెంకటేశ్వరరావు(25) అక్కడికక్కడే మృతి చెందాడు. పంచనామా అనంతరం శవ పరీక్షకు మృతదేహాన్ని ఏలూరు సర్వజన ఆస్పత్రికి తరలించామని, ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

ఏలూరు క్రైం, అక్టోబరు 13 : గుర్తు తెలియని వ్యక్తి రైలు పట్టాలపై తలపెట్టి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని పెద్ద రైల్వే స్టేషన్ దాటిన తరువాత సుమారు 50 ఏళ్ల వయస్సు ఉన్న ఒక వ్యక్తి రైలు పట్టాలపై తలపెట్టి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న రైల్వే ఎస్ఐ పి.సైమన్ తన సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడు గులాబి రంగు పొట్టి చేతుల చొక్కా, సిమెంటు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. అతని వివరాలు తెలిసిన వారు ఏలూరు రైల్వే ఎస్ఐ సెల్‌నెంబర్ 99892 19559కు సమాచారం అందించాలని రైల్వే పోలీసులు కోరారు. మృత దేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కాలువలో పడి వృద్ధురాలి మృతి

ఏలూరు క్రైం, అక్టోబరు 13 : ఓ వృద్ధురాలు ప్రమాదవశాత్తు కాలువలోపడి మృతి చెందింది. ఏలూరు పాండురంగపురంనకు చెందిన వీరంకి విజయలక్ష్మి (77) ఏలూరు బావిశెట్టివారిపేట సమీపంలో ఉన్న కనక దుర్గమ్మ ఆలయానికి పూజలకు వెళ్ళి అనంతరం అక్కడ ఉన్న కాలువ రేవులో కాళ్లు కడుక్కుంటుండగా ప్రమాదవ శాత్తు జారిపడి మృతి చెందింది. సమాచారం అందుకున్న వన్‌టౌన్ సీఐ జి.సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృత దేహాన్ని బయటకు తీసి ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ..

ఏలూరు క్రైం, అక్టోబరు 13 : కాలిన గాయాలతో గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న ఒక వృద్ధురాలు ఆదివారం మృతి చెందింది. ఏలూరు రూరల్ మండలం మాదేపల్లి గురకలపేటలో నివాసముంటున్న మోరు అంతిర్వేజమ్మ (68) ఆమె భర్త కలిసి ఉంటున్నాడు. ఈ నెల ఏడున గ్యాస్ స్టౌ వెలిగించగా ప్రమాదవశాత్తు మంటలు అంటుకుని అగ్ని ప్రమాదం సంభవించింది. తీవ్ర గాయాలపాలైన ఆమెను గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. ఈ సంఘటనపై ఏలూరు రూరల్ ఎస్ఐ సిహెచ్.దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు గుంటూరు ప్రభుత్వాస్పత్రికి వెళ్లి శవ పంచనామా, పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

పెనుగొండ, అక్టోబరు 13: కుటుంబ కలహాలతో జొన్నాల గౌతమి బ్రిడ్జిపై నుంచి గోదావరిలోకి దూకి మహిళ ఆత్మహత్యయత్నానికి పాల్పడిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పెనుగొండ మండలం నడిపూడికి చెందిన వెన్నటి రాజేశ్వరి(35) భర్త వెన్నటి శ్రీనివాసులు శనివారం రాత్రి గొడవ పడ్డారని, మనస్థాపంతో అదే రోజు ఆమె ఆత్మహత్యాయత్నం చేయగా భర్త అడ్డుకున్నాడని బంధువులు తెలిపారు. ఆదివారం ఉదయం రాజమండ్రి బస్సు ఎక్కి వెళుతుండగా భర్త శ్రీనివాస్ కూడా వెనుక బస్సులో ఆమె కోసం వెళ్లాడని తెలిపారు. అప్పటికే ఆమె జొన్నాడ గౌతమి బ్రిడ్జిపై నుంచి గోదావరిలోకి దూకడంతో స్థానికులు గుర్తించి జాలర్ల సహాయంతో ఆమెను బయటకు తీసి ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. భర్త రాజమండ్రి బస్టాండ్ తదితర ప్రాంతాల్లో వెతుకుతుండగా రావులపాలెం పోలీసుల నుంచి సమాచారం అందడంతో ఆస్పత్రికి వెళ్లినట్లు బంధువులు వెల్లడించారు.

వృద్ధుడిని కాపాడిన పోలీసులు

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 13: పంట చేలలో నిర్జీవంగా పడిఉన్న ఓ వృద్ధుడిని చనిపోయాడని భావించి రైతులు పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు ఆ వృద్ధుడిలో కదలిక గమనించి కాపాడిన ఘటన పోచమ్మపురంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదతాడేపల్లి శివారు పోచమ్మపురం పంట చేలలో ఓ వృద్ధుడు పడి ఉండటాన్ని స్థానిక రైతులు గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. రూరల్ ఎస్సై ప్రసాద్ ఆధ్వర్యంలో ఆ వృద్ధుడిని బయటకు తీసేందుకు వెళ్లగా అతడు కదలడం గమనించి వెంటనే బయటకు తీసి బురద కడిగారు. ఆ వృద్ధుడు కదలలేని స్థితిలో ఉండడంతో సపర్యలు చేసి అన్నం తినిపించి తాడేపల్లిగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు. వృద్ధుడు బీహార్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించారు.

పిడుగుపాటుకు విద్యుత్ సామగ్రి దగ్ధం

మొగల్తూరు, అక్టోబరు 13: పిడుగు పాటుకు మొగల్తూరులోని పలు నివాసాల్లో విద్యుత్ సామగ్రి కాలిపోయాయి. ఉన్నత పాఠశాల సమీపంలో ఆదివారం సాయంత్రం కొబ్బరి చెట్టుపై పడిన పిడుగుపడటంతో అప్రాంతలోని నివాసాల్లో గల టీవీలు, ఫ్రిజ్‌లు, వాషింగ్‌మిషన్‌లు, ఇన్వెటర్‌లు కాలినట్టు స్థానికులు తెలిపారు.

ఇంటి తాళాలు పగులగొట్టి.. బంగారం చోరీ దారికాచి..

ఇంటి తాళాలు పగులగొట్టి..

ఏలూరు క్రైం, అక్టోబరు 13 : తాళం వేసి ఊరువెళ్లి వచ్చేటప్పటికి దొంగ లు ఇంటి తాళాలు పగులగొట్టి ఆరుకాసుల బంగారు ఆభరణాలు అపహ రించుకుపోయారు. ఏలూరు శాంతినగర్ 3వ రోడ్డులో నివాసముంటున్న రేకపల్లి సౌజన్య ఈ నెల 7న కుటుంబ సభ్యులతో చెన్నై వెళ్లి తిరిగి 13వ తేదీ ఉదయం వచ్చారు. 12వ తేదీ అర్ధరాత్రి రెండు గంటలకు ఒక దొంగ ఇంట్లోకి ప్రవేశించి బీరువాలు కూడా పగులగొట్టి ఆరు కాసుల బంగారు ఆభరణాలు అపహరించుకుపోయినట్లు అక్కడ ఉన్న సీసీ కెమెరాల్లో రికా ర్డు అయింది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు త్రీ టౌన్ సీఐ ఎస్ కోటేశ్వరరావు తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దారికాచి..

భీమవరం క్రైం, అక్టోబరు 13 : ద్విచక్ర వాహనంపై వెళ్తున్న భార్యాభర్తల్ని అడ్డగించి బెదిరించి మెడలో ఉన్న బంగారుతాడును గుర్తు తెలియకుండా దుండగులు దోచుకెళ్లారు. భీమవరం రూరల్ పోలీస్‌స్టేషన్ హెచ్‌సీ మహేశ్వరరావు తెలిపిన వివరాలు ప్రకారం భీమవరం మండలం యనమదుర్రుకి చెందిన మడ్డి ఆదినారాయణ ఈ నెల 11న భార్యతో కలిసి, ద్విచక్ర వాహనంపై భీమవరం ఆస్పత్రికి వచ్చి రాత్రి 10 గంటలకు తిరిగి ఇంటికి వెళ్తుండగా వెనుకాల ఒక మోటార్ సైకిల్‌పై ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి వాహనాన్ని ఆపమన్నారు. అనంతరం ఆమె మెడలో ఉన్న నాలుగు కాసుల బంగారు తాడుని లాక్కుని పరారయ్యారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.



గుబ్బల మంగమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

గుబ్బల మంగమ్మను దర్శించుకున్న భక్తులు

బుట్టాయగూడెం, అక్టోబరు 13: గిరిజనుల ఆరాధ్యదైవం గుబ్బల మంగమ్మను ఆదివారం భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి ఉదయం నుంచి భక్తులు పోటెత్తారు. సెలవులు రావడంతో అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారి దర్శనాలకు తరలివచ్చారు. వాతావరణం కూడా పొడిగా ఉండడంతో భక్తులు ఏజెన్సీకి క్యూ కడుతున్నారు. దర్శనాలు త్వరగా ముగించుకుని భక్తులు సాయంత్రం 3 గంటలు తర్వాత బయటకు వెళ్లాలని ఆలయ కమిటీ భక్తులకు సూచించింది. అమ్మవారి దర్శనాలకు ఎటువంటి ఆటంకాలు కలుగకుండాఏర్పాట్లు చేశారు.

గంగానమ్మ ఆలయ వార్షికోత్సవం

ఏలూరు కార్పొరేషన్, అక్టోబరు 13: నగరంలోని నాగేశ్వరపురం చెరువుగట్టు వద్ద గణేశ్ కార్తికేయ గంగానమ్మ, ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. అర్చకులు బాపట్ల వెంకటేశ్వరశర్మ భక్తులతో అభిషేకాలు, అర్చనలు, కుంకుమార్చన, సామూహిక పూజలు జరిపించారు. అనంతరం అమ్మవారి ప్రతిమతో మేళతాళాలతో ఊరేగింపు జరిపారు. వీధివీధిన అమ్మవారిని భక్తులు హారతులు ఇచ్చి మొక్కుబడులు చెల్లించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ భక్తులకు ఏర్పాట్లు చేశారు.

శ్రీవారికి పాశాంకుశ ఏకాదశి పూజలు

ఆశ్వయుజ మాసంలోని పాశాంకుశ ఏకాదశి పర్వదినం కావడంతో ఆదివారం రామచంద్రరావుపేటలోని వేంకటేశ్వరస్వామికి భక్తులు తులసీదళాలు, పుష్పాలతో ప్రత్యేక అర్చనలు జరిపారు. గోవిందనామ సం కీర్తనలు ఆలపించారు. భగవద్గీతను భక్తులు సామూహికంగా పఠించారు.

అయ్యప్ప మాలధారులకు నిత్య భిక్ష

ఏలూరు అయ్యప్ప అన్న సమారాధానోత్సవ కమిటీ ఆధ్వర్యంలో దీక్షాధారులకు నిర్వహించే నిత్య భిక్షా కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బడేటి చంటి ఆదివారం ప్రారంభించారు. అయ్యప్పస్వామికి అభిషేకాలు, అర్చనలు, హోమాలు నిర్వహించారు. జనసేన నాయకులు రెడ్డి అప్పలనాయుడు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రామకోటి ప్రాంగణంలో ఈనెల 23 నుంచి 55 రోజులపాటు అయ్యప్ప, భవానీ దీక్షాదారులకు నిత్య భిక్షా కార్యక్రమాన్ని అయ్యప్పస్వామి అన్నదాన సమాజం ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు.

సాయినాథుడి గ్రామోత్సవం

చింతలపూడి, అక్టోబరు 13: స్థానిక షిరిడీసాయి సేవా మందిర్‌లో మూడు రోజులపాటుజరిగే ఉత్సవాల్లో భాగంగా కుంకుమ పూజలు జరిపారు. ఆదివారం భారీ ఊరేగింపు నిర్వహించారు. సాయినాధుని విగ్రహం ఆలయం నుండి ఊరేగింపుగా ప్రారంభించారు. బాణసంచా కాల్పులు, సాయినాధుని వేషధారణ, తీన్‌మార్ డప్పులు, మహిళల కోలాటం, పల్లకీ సేవ నిర్వహించారు. మెయిన్‌రోడ్డు, జిబిజి రోడ్డు, ప్రధాన వీధుల్లో రాత్రి వరకు ఊరేగించారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ

ఏలూరు టూటౌన్, అక్టోబరు 13: మహాదేవుడైన పరమేశ్వరుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఎమ్మెల్యే బడేటి చంటి ఆకాంక్షించారు. పోణంగిలో నూతనంగా నిర్మించనున్న ఆలయానికి ఎమ్మెల్యే బడేటి చంటి, మీన దంపతులు ఆదివారం భూమిపూజ చేసి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ నిర్మాణానికి పిళ్లారిశెట్టి సురేష్ స్థలాన్ని విరాళంగా ఇచ్చారు. ధర్మకర్తల మండలి అధ్యక్షులు బదిరినాథ్, కార్యదర్శి హనుమాన్‌శక్తి ఉమామహేశ్వరరావు, కోశాధికారి సంధ్యా, శ్రీలక్ష్మి, ఆర్నేపల్లి తిరుపతి, సాంబశివరావు పాల్గొన్నారు.

సాయిబాబాకు 108 బిందెల జలంతో అభిషేకం

కుక్కునూరు, అక్టోబరు 13: కుక్కునూరులో ఆదివారం సాయిబాబాకు 108 బిందెల అభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయిబాబా దసరా రోజున సమాధి చెందిన క్రమంలో మరుసటి రోజున సమాధి ఉత్సవంగా జరపడం ఆనవాయితీ. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అభిషేకాలు చేశారు. అనంతరం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ భక్తులకు ప్రసాదాలు అందించారు. ఆలయ పూజారి హనుమాన్ సాయి పూజా కార్యక్రమాలు జరిపించారు.

పాల వ్యాన్‌ను ఢీకొట్టిన భవానీ భక్తుల వాహనం

ఏలూరు క్రైం, అక్టోబరు 13: భవాని భక్తులతో విజయవాడ వెళుతున్న వాహనం జాతీయ రహదారిపై ఆగిఉన్న పాల వ్యాన్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. అనకాపల్లి జిల్లా తుని ప్రాంతానికి చెందిన భవాని భక్తులు ఒక వ్యాన్‌లో విజయవాడ కనకదుర్గమ్మ దర్శనానికి బయలుదేరారు. ఆదివారం తెల్లవారుజామున ఆశ్రం ఆస్పత్రి సమీపంలో జాతీయ రహదారిపై ఆగి ఉన్న పాల వ్యాన్‌ను వెనుక నుంచి భవానీ భక్తుల వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన వారిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి అనంతరం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. క్షతగాత్రుల సమాచారాన్ని రూరల్ పోలీసులు సేకరిస్తున్నారు.

భవాని భక్తులకు పోలీసుల సూచనలు



భక్తుల చొక్కాపై రేడియం స్టిక్కర్‌లు అతికిస్తున్న సిబ్బంది

ద్వారకాతిరుమల, అక్టోబరు 13: జాతీయ రహదారి మీదుగా విజయవాడకు కాలినడకన వెళుతున్న భవాని భక్తులు ప్రమాదాల బారిన పడకుండా పోలీసు శాఖ చర్యలు చేపట్టింది. భీమడోలు సీఐ యూజే విల్సన్, ఎస్ఐ సుధీర్ సూచనలు ఇచ్చారు. రహదారిపై నడిచి వెళ్లే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. రాత్రివేళ నడిచి వెళ్లే వారు మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతూ వారి బ్యాగులపైనా, చొక్కాల వెనుక రేడియం స్టిక్కర్లను అతికించారు. మెయిన్‌రోడ్డుపై కాకుండా సర్వీస్ రోడ్డును వినియోగించాలన్నారు. లేకుంటే ఎడమ వైపు మార్జిన్‌లో నడవాలన్నారు.

● పెదపాడు: బస్, కార్లు, ఇతర వాహనాలు, నడిచి వెళ్లే భవాని భక్తులు రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటిస్తూ ప్రయాణం సాగించాలని ఎస్పీ కె.ప్రతాప్‌శివకిషోర్ సూచించారు. దసరా ఉత్సవాలను పురస్కరించుకుని విజయవాడకు కాలినడక వెళ్లే, దర్శనానంతరం తిరుగు ప్రయాణమైన భక్తులకు కలపర్రు టోల్‌గేట్ వద్ద అల్పాహారం, మజ్జిగ ప్యాకెట్లను ఆదివారం పంపిణీ చేశారు. ఎస్పీ మాట్లాడుతూ భవానీ భక్తులు జాగ్రత్తగా రోడ్డు పక్కగా సర్వీస్ రోడ్డులో ప్రయాణం చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఊక లారీని ఢీకొన్న వ్యాన్ : డ్రైవర్, క్లీనర్‌కు గాయాలు

దెందులూరు, అక్టోబరు 13: ఊక లారీని వ్యాన్ ఢీ కొట్టిన ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. జాతీయ రహదారిపై సత్యనారాయణపురం వద్ద ముందు వెళుతున్న ఊక లారీని భవాని భక్తులు ప్రయాణిస్తున్న వ్యాన్ ఢీకొంది. వ్యాన్‌లో ఉన్న భవాని మాలదారులు క్షేమంగా ఉన్నారు. డ్రైవర్, క్లీనర్ గాయపడ్డారు. హైవే పోలీసులు వారిని కాకినాడ ఆసుపత్రికి తరలించారు,

రోడ్డు ప్రమాదంలో వింజరం సర్పంచ్ మృతి



బాలరాజు (ఫైల్)

కుక్కునూరు, అక్టోబరు 13: వింజరం సర్పంచ్ జగిడి బాలరాజు (32) ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. తెలంగాణలోని అశ్వారావుపేట మండలం కుడుములపాడు వద్ద ద్విచక్ర వాహనంపై వస్తుండగా ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అశ్వారావుపేట తరలించగా మృతి చెందాడు. ఆయన వింజరం సర్పంచ్‌గా రెండోసారి ఎన్నికయ్యారు. బాలరాజు మృతితో గ్రామంలో విషాదం అలుముకుంది.

రంగుల హరివిల్లు



కొవ్వలిలో కనువిందు చేసిన ఇంద్రధనస్సు

విజయదశమి రోజున కొవ్వలి వద్ద ఆకాశంలో ఇంద్రధనస్సు కనువిందు చేసింది. గ్రామస్థులు, వాహనదారులు ఆసక్తిగా తిలకించారు. - దెందులూరు



టి.నరసాపురంలో కలశాలతో అమ్మవారి ఊరేగింపు



ఏలూరు, చింతలపూడిలో అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ, లింగపాలెంలో ఊరేగింపు, జీలుగుమిల్లిలో ఎమ్మెల్యే పూజలు



చింతలపూడిలో అమ్మవారి ఊరేగింపులో కోలాటం

ఉత్సవ శోభ

జిల్లాలో దసరా ముగింపు వేడుకలు

వైభవంగా అమ్మవారి ఊరేగింపు



ఏలూరు నగరంలో వైభవంగా సాగిన అమ్మవారి ఊరేగింపు



ఏలూరులో అమ్మవారి ఊరేగింపులో అలరించిన వేషధారణలు

ద్వారకాతిరుమల, అక్టోబరు 13: కుంకుళ్లమ్మ దివ్య రథోత్సవం శనివారం రాత్రి అంగరంగవైభవంగా జరిగింది. శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని రథోత్సవాన్ని నిర్వహించారు. కుంకుళ్లమ్మ ఏడాదికోసారి మాత్రమే క్షేత్రానికి రావడం సంప్రదాయం. ఆలయం వద్ద రథవాహనాన్ని అలంకరించి అమ్మవారి ఉత్సవమూర్తిని వేదమంత్రోచ్ఛరణల నడుమ రథంలో ఉంచారు. అర్చకులు, పండితులు అమ్మవారికి ప్రత్యేక అలంకారాలు, పూజలు చేశారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, తీన్మార్ డప్పు వాయిద్యాలు, విచిత్ర వేషధారణలతో రథయాత్ర క్షేత్రపుర వీధులకు పయనమైంది. రథంలో అమ్మవారికి అడుగడుగునా భక్తులు నీరాజనాలు పలికారు.

● పెదవేగి: రాట్నాలకుంట రాట్నాలమ్మ పదో రోజు శనివారం రాజ రాజేశ్వరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. చేతిలో చెరకుగడతో చిద్విలాసంగా నవ్వులు చిందిస్తూ శ్రీరాజరాజేశ్వరిదేవిగా, ప్రశాంతవదనంతో, అభయమిచ్చే కరుణామయిగా శ్రీరాట్నాలమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి ఆదివారం భక్తులు విశేష పూజలు చేశారు.

● ఏలూరు కార్పొరేషన్: నగరంలో శరన్నవరాత్రులు ముగియడంతో శని అమ్మవారి ఊరేగింపులు, డప్పు వాయిద్యాలు, మేళతాళాలు, వేద మంత్రోచ్ఛరణ, తీన్‌మార్ వాయిద్యాలతో సందడి నెలకొంది. అమ్మవారు రాజరాజేశ్వరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

● ఏలూరు టూటౌన్: అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఎమ్మెల్యే బడేటి చంటి ఆకాంక్షించారు. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే చంటి నగరంలో పలు ఆలయాలను సందర్శించారు. అమ్మవారు విశేష అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. పవర్‌పేట కాశీ అన్నపూర్ణసమేత విశ్వేశ్వర స్వామివారి ఆలయంలో అమ్మవారు వజ్రకవచాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవాసుదేవ స్వామి ఆలయంలో అమ్మవారు నిజరూప రజిత కవచాలంకారంలో దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించి చంటి ప్రత్యేక పూజలు చేశారు. పెద్దిబోయిన శివప్రసాద్, బెల్లంకొండ కిషోర్, పూజారి నిరంజన్, అమరావతి అశోక్, మారం హనుమంతరావు, ఎన్.వాసు, యూ.రామాంజనేయులు, పాల్గొన్నారు.

లడ్డూ ప్రసాదం వేలం



కొయ్యలగూడెం: మండలంలో దసరా ముగింపు ఉత్సవాలు వైభవంగా జరిగాయి. కొయ్యలగూడెం కనకదుర్గమ్మ ఆలయంలో 18 కేజీల లడ్డూ ప్రసాదం వేలం నిర్వహించారు. ఇంజనీరింగ్ విద్యార్థిని విగ్గిన శ్రీజ లడ్డూను రూ.18 వేలకు దక్కించుకుంది.

● కామవరపుకోట: లక్ష్మీహయగ్రీవ లలితాశ్రీ పీఠంలో శరన్నవరాత్రులు ముగింపు సందర్భంగా దీపోత్సవం నిర్వహించారు. అమ్మవారు రాజ రాజేశ్వరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

● పెదపాడు: దసరా వేడుకలు మండలంలో ఘనంగా జరిగాయి. పెదపాడు, రామచంద్రపురం, గండిచెరువుగట్టు, తోటగూడెం, వసంతవాడ, కొత్తూరు, వట్లూరు, అప్పనవీడు, తదితర గ్రామాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. నాయుడుగూడెం, సత్యనారాయణపురం గ్రామాల్లో అన్నదానాలు నిర్వహించారు. అమ్మవారి నిమజ్జన కార్యక్రమాలు తీన్‌మార్ డప్పువాయిద్యాలు, విచిత్ర వేషధారణ నడుమ వేడుకగా జరిగాయి.

● ఉంగుటూరు: దసరా నవరాత్రులలో భాగంగా ఆలయాల్లో విశేష పూజలు చేశారు. శివాలయాలలో శమీ పూజలు నిర్వహించారు. కైకరం, కాగుపాడు, గొల్లగూడెం, చేబ్రోలు, ఉంగుటూరు, బొమ్మిడి, రాచూచు, బాదంపూడి తదితర గ్రామాలలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం రాత్రి జమ్మి చెట్లకు శమీ పూజలు నిర్వహించారు

● జీలుగుమిల్లి: స్థానిక జగదాంబ ఆలయంలో అమ్మవారు రాజరాజేశ్వరి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ కమిటీ అధ్యక్షులు కొండపల్లి దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. శమి(జమ్మి) వృక్షం వద్ద గోత్ర నామాలతో పూజలు చేశారు. ఎల్లమ్మ ఆలయం వద్ద భవానీ దీక్షలు చేపట్టి ఇరుముడి కట్టారు.

● బుట్టాయగూడెం: రెడ్డిగణపవరంలోని కనకదుర్గ అన్నపూర్ణ విశ్వేశ్వర స్వామి ఆలయంలో దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలు ముగింపు రోజున వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు.

● టినరసాపురం: శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. శమీ పూజ అనంతరం మూలమంత్ర హోమం నిర్వహించారు. టినరసాపురం, బొర్రంపాలెం, వెలగపాడు తిరుమలదేవిపేట, మక్కినవారిగూడెం, బండివారిగూడెం, అప్పలరాజుగూడెం తదితర గ్రామాల్లో అమ్మవారిని ట్రాక్టర్లపై అమ్మవారి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. టినరసాపురంలో అమ్మవారిని కలశంతో ఊరేగించారు.

● వేలేరుపాడు: స్థానిక సంతమార్కెట్ సెంటర్‌లో 9రోజుల పాటు పూజలందుకున్న అమ్మవారి విగ్రహానికి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. వేలేరుపాడు నుంచి భూదేవిపేట, రుద్రమ్మకోట పవిత్రగోదావరి నది వరకు అమ్మవారిని ఊరేగించి గోదావరిలో నిమజ్జనం చేశారు. భక్తులు, యువకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

● లింగపాలెం: నవరాత్రులు ముగియడంతో అమ్మవారిని గ్రామాల్లో మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి పట్టువస్త్రాలు, పసుపుకుంకుమలు, చీర, సారెలతో అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం పలు ఆలయాల వద్ద అన్నదానం చేశారు.

● చింతలపూడి: దసరా ఉత్సవాల ముగింపు సందర్భంగా పట్టణంలో అమ్మవారి విగ్రహాలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. మెరక వీధిలో ఏర్పాటుచేసిన దుర్గామాతను పట్టణంలో ఊరేగించారు. బాణసంచా, మేళతాళాలు, విచిత్ర వేషాలు, డీజె సౌండ్స్ డ్యాన్సులతో ఊరేగింపు వైభవంగా సాగింది. కొవ్వూరుగూడెం, పాత చింతలపూడి, మారుతీనగర్, భట్టువారిగూడెం విగ్రహాలను తమ్మిలేరు రిజర్వాయరులో నిమజ్జనం జరిపారు.

ఐసీఎం చర్చి నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కమిటీ సభ్యులతో జాన్ ఎస్‌డీరాజు

ఏలూరు టూటౌన్, అక్టోబరు 13: ఐసీఎం చర్చి కృష్ణా, గోదావరి డయాసిస్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎక్స్‌అఫిషియో అధ్యక్షుడిగా మోస్ట్ రెవరెండ్ బిషప్ జాన్ ఎస్‌డీ రాజు ఎన్నికయ్యారు. ఉపాధ్యాక్షులుగా ఎన్.జాన్‌లియో, కార్యదర్శిగా ఎన్‌వైవీ.ప్రసాద్, ట్రెజరర్‌గా వెరీ రెవరెండ్ డాక్టర్ టీఏసురత్నం, సభ్యులుగా రెవరెండ్ దేవదాసు యోబు, రెవరెండ్ తెనాలి కుటుంబరావు, చోరగుడి జాకబ్‌రాజు, బి.డెస్మండ్, రుద్రాక్షి డేవిడ్, తాడేపల్లి సుబ్బరాజు ఎన్నికయ్యారు. బిషప్ జాన్ ఎస్‌డీ.రాజు మాట్లాడుతూ కార్యవర్గం పదవీకాలం నాలుగేళ్లు ఉంటుందన్నారు. కృష్ణా, గోదావరి జిల్లాల్లోని ఐసీఎం సంఘాలు, పాఠశాలలన్ని కార్యవర్గం పరిధిలో పని చేస్తాయన్నారు.

రాయితీ ధరలకు కందిపప్పు, వంట నూనె విక్రయాలు

పోలవరం అక్టోబరు 13: కూటమి నాయకుల ఆధ్వర్యంలో శని, ఆదివారాలు రాయితీపై కందిపప్పు, వంట నూనె అమ్మకాలు నిర్వహించారు. కూటమి నాయకులు మాట్లాడుతూ సామాన్యులపై ధరల భారం పడకుండా వ్యాపారులతో చర్చించి పామాయిల్, సన్‌ఫ్లవర్ ఆయిల్ కందిపప్పు ధరలు రేషన్‌కార్డు కలిగిన వారికి తగ్గించి రాయితీపై పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కూటమి నాయకులు కొణతాల ప్రసాద్, గునపర్తి చిన్ని, బొడ్డు కృష్ణ, ఆటపాకల వెంకటేష్, కామిశెట్టి నాగరాజు, బొరగం వెంకటలక్ష్మి, వ్యాపారులు నాళం గాంధీ, చోడిశెట్టి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

గుర్రిపాటి బుచ్చి అప్పారావు జయంతి

చింతలపూడి, అక్టోబరు 13 : పట్టణంలోని వెలమపేటలో వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్వాతంత్ర సమరయోధుడు గొర్రిపెట్టి బుచ్చి అప్పారావు జయంతి ఆర్నేపల్లి అప్పారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. అప్పారావు చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో 1941లో అల్లిపురం జైలులో ఆరు నెలలు కారాగారశిక్ష అనుభవించారని, 1950లో అవిభక్త విశాఖ జిల్లా బోర్డు అధ్యక్షులుగా 1951లో మద్రాసులో కాంగ్రెస్ పార్లమెంటరీ బోర్డు సభ్యుడిగా నియమితులయ్యారని, 1960లో కాంగ్రెస్ నుంచి విడిపోయి విశాఖ జడ్పీ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. తరువాత ఎమ్మెల్యేగా పనిచేశారన్నారు. కార్యక్రమంలో సభ్యులు డోకల రాము, బి.ఉమామహేశ్వరరావు, దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

మద్ది క్షేత్రంలో కార్తీక మాసోత్సవాల ఏర్పాట్లు

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 13: గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో నవంబరు 2 నుంచి కార్తీక మాసోత్సవాలు నిర్వహించనున్నారు. ఆలయ సహాయ కమిషనర్, ఈవో ఆర్‌వి.చందన ఆదివారం ఆలయ ప్రాంగణం వద్ద కార్తీక ఏర్పాట్లు చేపట్టారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేత

ఏలూరు రూరల్, అక్టోబరు 13: విద్యార్థులు ప్రతిభాపాటవాలతో పాటు నైతిక విలువలను పెంపొందించుకోవాలని సీఆర్‌.రెడ్డి మహిళా కళాశాల ప్రిన్సిపాల్ చలసాని అరుణ అన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మాతృదేవోభవ సేవాట్రస్ట్ ఆధ్వర్యంలో ఛైర్మన్ వి.కృష్ణమోహన్‌రావు అధ్యక్షతన రూ.10వేలు చొప్పున ఆర్థిక సాయాన్ని అందచేశారు. 17 మంది విద్యార్థులకు లక్షా70వేలు అందజేశారు. మైలవరపు లక్ష్మీనరసింహ, నందమూరి విజయలక్ష్మి, పండరీనాథ్, జె.సత్యనారాయణరాజు, మానేపల్లి సత్యనారాయణ, ట్రస్ట్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

లింగపాలెం, అక్టోబరు 13: విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని మూడా వెంకటేశ్వరరావు అన్నారు. సింగగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలలో 2023-24 ఎస్‌ఎస్‌సీలో అత్యధిక మార్కులు సాధించిన షేక్ అస్మాబేగంకు రూ.10వేలు నగదు, జ్ఞాపిక అందజేశారు. ఇదే పాఠశాలలో చదువుకున్న తాను పెదవేగి సాంఘిక సంక్షేమ పాఠశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నానని తెలిపారు. విద్యార్థులు బాగా చదువుకుని పాఠశాలకు, తల్లిదండ్రులకు గౌరవం తేవాలన్నారు. హెచ్‌ఎం శ్రీధర్, ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

రైతులు అధిక ఆదాయం పొందితేనే అభివృద్ధి



వెదురు తోటలను పరిశీలిస్తున్న తుమ్మల

కామవరపుకోట, అక్టోబరు 13: రైతులు అధిక ఆదాయం వచ్చే విధంగా సాగు చేస్తే గ్రామాలు అభివృద్ధిపథంలో పయనిస్తాయని తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. పోలాసిగూడెంలో పామాయిల్, వెదురు మంత్రి తుమ్మల ఆదివారం పరిశీలించారు. వ్యవసాయ సాగుపై రైతులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ పామాయిల్‌కు ఆదాయం వచ్చే విధంగా తీసుకున్న చర్యలు అభినందనీయమన్నారు. ప్రకృతి వ్యవసాయం చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని, తద్వారా భూమికి బలం, రైతుకు తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం లభిస్తుందన్నారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ, కంఠమనేని చిన సత్యనారాయణ, డాకూరి ఆశీర్వాదం, పోలాసిగూడెం రైతులు ఉన్నారు.

ఏలూరు పాత బస్టాండ్ వద్ద పోలీసుల తనిఖీ

ఏలూరు క్రైం, అక్టోబరు 13: పాతబస్టాండ్‌లో ప్రయాణికులకు సదుపాయాలు కల్పించాలని డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ ఆర్టీసీ అధికారులకు సూచించారు. పాతబస్టాండ్ ప్రాంతాన్ని వన్ టౌన్ సీఐ సత్యనారాయణ, సిబ్బందితో కలిసి డీఎస్పీ పరిశీలించారు. లైటింగ్ తక్కువగా ఉండడాన్ని గమనించారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, లైటింగ్ ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులకు డీఎస్పీ శ్రావణ్‌కుమార్ సూచించారు. బస్టాండ్‌లో అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

20 వేల కిలోల చికెన్ వ్యర్థాలు స్వాధీనం

పెదపాడు, అక్టోబరు 13: చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు చికెన్ వ్యర్థాలను తరలిస్తుండగా పెదపాడు, పరిసర ప్రాంతాల్లో పోలీసులు తనిఖీ నిర్వహించారు. రెండు వాహనాలను స్వాధీనం చేసుకుని సుమారు 20 వేల కిలోల చికెన్ వ్యర్థాలను గొయ్యిలో పాతి పెట్టినట్లు ఎస్సై కట్టా శారద సతీష్ తెలిపారు. వాహన, చెరువు యజమానులు, వాహన డ్రైవర్లపై పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి ఎస్సై శారద సతీష్ దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురి పై కేసు

జీలుగుమిల్లి: కోళ్ల వ్యర్థాల్ని తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు పట్టుకున్నారు. హైదరాబాద్ నుంచి నిడమర్రు మండలం తోకలపల్లి గ్రామానికి ఆదివారం కోళ్ల వ్యర్థాలను తరలిస్తుండగా రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద పోలీసులు గుర్తించారు. పెదపాడు మండలం చినసత్యవోలుకు చెందిన మద్దాల చింటు, ముసునూరు మండలం రంగంపేటకు చెందిన పిల్లి వెంకటరమణ, అదే గ్రామానికి చెందిన దేవరపు కార్తీక్‌పై కేసు నమోదు చేశారు. వాహనం అదుపులోకి తీసుకుని గ్రామానికి దూరంగా ఉంచారు. కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వరావు చెప్పారు.

ఉచిత ఆయుర్వేద వైద్య సేవలు

ఏలూరు కార్పొరేషన్, అక్టోబరు 13: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రామకోటి ప్రాంగణంలో మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ టీవీఎం.నగేశ్ 72 మందికి కౌన్సెలింగ్ నిర్వహించి ఆరోగ్య పరిరక్షణలో సలహాలు, సూచనలు ఇచ్చారు. మందులు అందజేశారు. కార్యక్రమంలో చెన్నా వెంకట్రామయ్య, పిల్లి పండరీనాథ్, సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన పాడనా తియ్యగా..

ఏలూరు రూరల్, అక్టోబరు 13: ఎందరినో కళాకారులుగా తీర్చిదిద్దుతున్న ఎస్‌పీఎస్ మ్యూజిక్ అకాడమి వ్యవస్థాపకుడు వాసు నిర్వహణలో సాగిన పాడనా తీయగా.. చిన్నారుల కార్యక్రమం అలరించింది. వైఎంహెచ్‌ఏ ప్రాంగణంలో పాటల పోటీలు నిర్వహించారు. తొలుత ఎస్‌పీఎస్ దీప్‌చంద్ ప్రార్థనాగీతంతో ప్రారంభమై వహిదా వాసు సారధ్యంలో చిన్నారులు పాటలతో అలరించారు. ప్రముఖ నేపథ్యగాయనీ ఐశ్వర్య న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. లంకా వెంకటేశ్వర్లు, మానవత నాగేశ్వరరావు, ఇమ్మానియేలు, సెట్‌వెల్ సీఈవో ప్రభాకర్, గాయకులు అర్జున్‌రావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఎస్‌పీఎస్ వాసు పర్యవేక్షించారు.

నిరుద్యోగ యువత భవితకు ప్రభుత్వం అండ : చింతమనేని

పెదవేగి, అక్టోబరు 13: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే నిరుద్యోగ యువతకు మెగా అవకాశం కల్పించిందని, నిరుద్యోగ యువత భవితవ్యానికి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీ 2024 శిక్షణ శిబిరం పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. పేద కుటుంబాల వారందరికీ ఉద్యోగావకాశాలు లభించేలా డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామని ఆయన చెప్పారు. దాదాపు 600 మంది అభ్యర్థులు వినియోగించుకునేలా ఈ శిబిరాన్ని నిర్వహిస్తామని, నిరుద్యోగ యువత ఉద్యోగ అవకాశాలను చేజిక్కించుకోవాలని ఆయన సూచించారు. ఇక్కడ శిక్షణకు ఒక్క రూపాయి కూడా చెల్లించనవసరం లేదని, శిక్షణ ఇచ్చేందుకు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులను ఏర్పాటు చేశామని ఆయన చెప్పారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఉన్న డీఎస్సీ అభ్యర్థులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన తెలిపారు. ఈనెల 22వరకు దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో అభ్యర్థుల వివరాలు నమోదు చేసుకుంటామని, 27 నుంచి ఏలూరు కేపీడీటీ హైస్కూల్ ఆడిటోరియంలో 100రోజులపాటు శిక్షణ నిర్వహిస్తామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఉప్పలపాటి శ్రీరామ్‌ప్రసాద్, బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, మాగంటి నారాయణప్రసాద్, లావేటి శ్రీనివాసరావు, గుత్తా అనిల్, మోతుకూరి నానీ, తలకొండ జమలయ్య, కడియాల కృష్ణారావు, రత్నాకరరావు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.



డీఎస్సీ ఉచిత శిక్షణ శిబిరం పోస్టర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్

మద్యం లైసెన్స్‌ల కోసం ఒక్కటైన నేతలు

కొయ్యలగూడెం, అక్టోబరు 13: గత సార్వత్రిక ఎన్నికల్లో కత్తులు దూసుకున్న రాజకీయ నాయకులంతా ఒక్కటయ్యారు. ప్రభుత్వం మద్యం దుకాణాలకు దరఖాస్తులు కోరడంతో మద్యం వ్యాపారులు పోటెత్తారు. వివిధ రాజకీయ పార్టీ నాయకులు కూడా దరఖాస్తు చేశారు. ఎన్నికల్లో ఒకరి పై ఒకరు విమర్శలు గుప్పించుకునే ప్రతిపక్ష, అధికార పార్టీ నాయకులు సిండికేట్ కావడం గమనార్హం. జంగారెడ్డిగూడెం డివిజన్ కేంద్రం వేదికగా 3 నుంచి 4 సిండికేట్లుగా ఏర్పడి దరఖాస్తు చేశారు. అధికార పార్టీ నాయకులు, ప్రతిపక్ష పార్టీ నాయకులు ఉండడం విశేషం. ఎక్కడైన పార్టీల పరంగా డీడీలు తీసుకుంటుంటే ఈ ప్రాంతంలో అందరూ కలిసి డీడీలు తీసుకోవడం విశేషం. పోలవరం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 12 షాపులకు 590 వరకు దరఖాస్తులు వచ్చాయి. వాటన్నిటికి నేడు ఏలూరులో లాటరీ తీయనున్నారు.

చింతలపూడి సర్కిల్‌లో 799 దరఖాస్తులు

చింతలపూడి, అక్టోబరు 13: చింతలపూడి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని నాలుగు మండలాల్లో 16 దుకాణాలకు 799 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తు రూపేణా రూ.15.98 కోట్లు వసూలైంది. చింతలపూడి మండలంలో 5 షాపులకు 246, కామవరపుకోట మండలంలో 4 షాపులకు 185, లింగపాలెం మండలంలో 4 షాపులకు 194, టి.నరసాపురం మండలంలో 3 షాపులకు 174 దరఖాస్తులు అందినట్లు ఎక్సైజ్‌సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.అశోక్ తెలిపారు. వీటికి ఏలూరులో డ్రా తీసి షాపులను కేటాయిస్తారన్నారు.

స్థానిక గిరిజనులకే మద్యం దుకాణాలు కేటాయించాలి

బుట్టాయగూడెం, అక్టోబరు 13: బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, పోలవరం, వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో పీసా గ్రామసభ నిర్వహించి మద్యం దుకాణాలు స్థానిక గిరిజనులకే అప్పగించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు కుంజా కృష్ణంరాజు, రవ్వ బసవరాజు, పొడియం కొవ్వాడయ్య డిమాండ్ చేశారు. ఏజెన్సీ మండలాల్లో మద్యం దుకాణాలను నెలకొల్పాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చినందున షాపుల ఏర్పాటుకు ముందుగా గ్రామాల్లో పీసా గ్రామసభలు ఏర్పాటు చేయాలన్నారు. లైసెన్సులు మంజూరు చేయాలన్నా ఎక్సైజ్‌శాఖ గ్రామసభ అభిప్రాయాన్ని తీసుకోవాలని స్థానిక గిరిజనులకు లైసెన్సులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామసభ నిర్ణయమే తుది నిర్ణయంగా ప్రభుత్వం భావించాలన్నారు.

శ్రీరంగనాథస్వామి ఆలయంలో అపచారాలకు నిరసన

ఏలూరు రూరల్, అక్టోబరు 13: సనాతనధర్మ పరిరక్షణకు సంఘటితంగా పోరాటం చేస్తామని బ్రాహ్మణ సంఘ ప్రముఖులు పేర్కొన్నారు. తమిళనాడులోని శ్రీరంగనాథస్వామి ఆలయలో అపచారాలకు కారణమైన అక్కడి పాలకుల వైఖరిని నిరసిస్తూ సనాతన ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో వసంతమహల్ సెంటర్లో నిరసన దీక్ష నిర్వహించారు. సీఏపీ.రామానుజాచార్యులు మాట్లాడుతూ ప్రసాదాల పేరిట ఏవో పదార్థాలు తెచ్చి పంచడం ఆలయ ఆగమ విరుద్ధమన్నారు. టీకేఎస్ఆర్ ఐయ్యంగార్, మైలవరపు గురుశర్మ, కె.కృష్ణమాచార్యులు, సత్యవాడ దుర్గాప్రసాద్ మాట్లాడారు.

విద్యార్థిని ఫీజు నిమిత్తం రూ.1.4 లక్షలు అందజేత

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 13: కళాశాల ఫీజు చెల్లించడానికి ఇబ్బందులు పడుతున్న ఇంటర్ చదువుతున్న పేద విద్యార్థినికి దాత నాటకశాల వెంకటరాజు రూ.1.4 లక్షల నగదును ఆదివారం అందజేశారు. ఎంబి సోషల్ క్లబ్ గౌరవ అధ్యక్షుడు మల్లాది సీతారామారావు వెంకటరాజు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పద్మాకర్, చిట్రోజు తాతాజీ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు రూరల్ :** శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో కత్తిమండ ప్రతాప్ సారధ్యంలో ఈనెల 19, 20 తేదీల్లో తాడేపల్లిగూడెంలో ప్రపంచ తెలుగు సాహిత్య కళా జాతర కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ఏలూరుకు చెందిన కవి మైలవరపు గురుశర్మను ఆహ్వానించారు.
- **పెదవేగి :** శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం జరిగింది. లైబ్రేరియన్ తోట అరుణ్‌కుమార్ మాట్లాడుతూ గ్రంథాలతో గడిపే ప్రతిక్షణం ఎంతో విలువైనదని, విజ్ఞానదాయక అంశాలను నేర్చుకోవడానికి గ్రంథాలయాలు దోహదపడతాయన్నారు.
- **ద్వారకాతిరుమల :** శ్రీవారి ప్రాణదాన ట్రస్టు ద్వారా ఆలయంలో నిర్వహిస్తున్న ఉచిత ప్రథమ చికిత్సా కేంద్రానికి తెనాలికి చెందిన ఏవీ సాంబశివరావు మందులను అందజేశారు. మూడు వేల మందికి సరిపడా మందులను దేవస్థానం వైద్యుడు రాజేంద్రప్రసాద్‌కు అప్పగించారు.
- **పోలవరం :** షిర్డీ సాయిబాబా ఆలయంలో ఆదివారం భారీ అన్నదానం నిర్వహించారు. ఆలయంలో విఘ్నేశ్వర పూజ, బాబా వారికి ఏకవార రుద్రాభిషేకం, అనంతరం విభూది చందన పుష్పార్చన నిర్వహించారు.
- **జంగారెడ్డిగూడెం :** ఉద్యోగ కార్మిక సంఘాల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 18న విజయవాడలో జరిగే రాష్ట్ర కార్మిక సదస్సును జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కెవి.రమణ పిలుపునిచ్చారు. సదస్సు వాల్ పోస్టర్ విడుదల చేశారు.
- జంగారెడ్డిగూడెం పట్టణంలోని నూకాలమ్మ ఆలయంలో 16న జరిగే 68 వ మహా చండీ హోమం, మహా పూర్ణాహుతితో దసరా శరన్నవరాత్రులు ముగుస్తాయని ఆలయ చైర్మన్ రాజాన సత్యనారాయణ (పండు) తెలిపారు. ఆలయంలో నర్మదా అమృత భాణ లింగేశ్వరస్వామికి పంచామృతాభిషేకాలు జరుగుతాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.శ్రీవిజయదుర్గ ఆలయం వద్ద సోమవారం అన్నదానం జరుగుతుందని ఆలయ కమిటీ అధ్యక్షుడు మారిశెట్టి రాధాకృష్ణ తెలిపారు.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాలదాలు స్వీకరించాలని కోరారు.





నూజివీడు కోట మహిషాసురమర్దిని ఆలయంలో ఆయుధపూజ నిర్వహిస్తున్న డీఎస్పీ




వైభవంగా దసరా వేడుకలు

» రాజరాజేశ్వరిగా భక్తులను కటాక్షించిన దుర్గమ్మ » ఆంధ్రా మైసూర్ నూజివీడులో ఘనంగా ఉత్సవాలు » అమ్మవార్ల ఊరేగింపు



కోటపాడులో శ్రీరాజరాజేశ్వరికి పూజలు చేస్తున్న భక్తులు

నూజివీడు, అక్టోబరు 13: దసరా ఉత్సవాల్లో ఆంధ్రా మైసూరుగా పేరుగాంచిన నూజివీడులో ఉత్సవాలు వైభవంగా సాగాయి. శనివారం రాత్రి తెల్లవార్లు నూజివీడు పురవీధులు భక్తులతో కిటకిటలాడాయి. సంప్రదాయ బద్ధంగా ఉయ్యూరు ఎస్టేట్ జమీందారీ వారసులు ఎంఎంఆర్వి అప్పారావు జమ్మి కొట్టి ఉత్సవాలను ప్రారంభించారు. అంతకు ముందు నూజివీడు కోట మహిషాసుర మర్దిని ఆలయంలో నూజివీడు డీఎస్పీ ఎంవీవీఈఎన్ ప్రసాద్, ఇతర అధికారులు ఆయుధ పూజ నిర్వహించగా నూజివీడు దేవదాయ ధర్మదాయశాఖ ఈవో అలివేణి ఆయుధ పూజ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. దసరా రోజు శనివారం తెల్లవారుజాము నుంచి కోటమహిషాసుర మర్దిని అమ్మవారు రాజరాజేశ్వరిగా దర్శనమివ్వగా దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. శనివారం సాయంత్రం అమ్మవారిని హంస వాహనంపై నగరోత్సవం నిర్వహించారు. నూజివీడు గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ పరిధిలోని నూజివీడు కోట మహిషాసుర మర్దిని ఆలయం, నూజివీడు వేంకటాచలస్వామి ఆలయం నుంచి ఉత్సవమూర్తులతో పాటు జమీందారీల పరిధిలో గల రాజగోపాలస్వామి ఆలయం నుంచి ఉత్సవమూర్తులకు నగరోత్సవాన్ని నిర్వహించారు. తొలుత ఉత్సవ మూర్తులను నూజివీడులోని ఉయ్యూరు ఎస్టేట్ ప్రాంగణానికి తీసుకువెళ్లారు. సంప్రదాయ బద్ధంగా జమీందారీ వారసులు ఎంఎంఆర్వీ అప్పారావు జమ్మికొట్టి ఉత్సవాలను ప్రారంభించారు. స్పోర్టింగ్ క్లబ్, దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బుట్టబొమ్మల ప్రదర్శన, కత్తిసాము, కోలాటం వంటి వాటితో పాటు విచిత్రవేషధారణలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. నూజివీడు మండలం వెంకటాద్రిపురం గ్రామానికి చెందిన నాదెళ్ల పవన్‌కుమార్, సురేష్‌కుమార్‌ల ఆధ్వర్యంలో సుమారు 250 కేజీల పులిహోర, దద్దోజనం ప్రసాదాన్ని భక్తులకు అందించారు. నూజివీడు పట్టణంలోని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ కార్యాలయంతో పాటు వివిధ పోలీస్ స్టేషన్‌లలో ఆయుధ పూజ నిర్వహించారు. ఎక్సైజ్ సీఐ ఎ. మస్తానయ్య ఆధ్వర్యంలో, నూజివీడు రూరల్ పోలీస్ స్టేషన్‌లో రూరల్ ఎస్సై లక్ష్మణ్‌బాబు ఆధ్వర్యంలో ఆయుధ పూజ నిర్వహించారు.

చాట్రాయి: మండలంలో విజయదశమిని ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కోటపాడు పాత రామాలయంలో అమ్మవారు రాజరాజేశ్వరి అలంకరణలో దర్శనమివ్వగా బొంతు రాంబాబు దంపతులు, మంచిన పూర్ణచంద్రరావు, మోరంపూడి జయరామ్ తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు గ్రామాల్లో దుర్గాదేవి విగ్రహాలను మంగళవాయిద్యాలతో ఊరేగించారు.

ముసునూరు: విజయదశమి పర్వదినాన అమ్మవార్లు రాజరాజేశ్వరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ముసునూరు పడమట రామాలయంలో దుర్గమ్మను ఘనంగా ఊరేగించి, స్థానిక నగరాల చెరువులో నిమజ్జనం చేశారు. బలివేలో రాజరాజేశ్వరి విశేష ఆలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈవో సీతారామయ్య, ఎస్ఐ చిరంజీవి, సర్పంచ్ లక్ష్మీ సత్యనారాయణ, టీడీపీ నాయకుడు పర్వతనేని శ్రీనివాసరావు దంపతులు అమ్మవారికి పూజలు చేశారు.

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి శ్రీ లక్ష్మీనరసింహ వేద పాఠశాలలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఆదివారం ఆగిరిపల్లి పురవీధుల్లో భారీ ఊరేగింపు నిర్వహించి స్థానిక వరాహ పుష్కరిణిలో నిమజ్జనం చేశారు.

కైకలూరు మండలంలో..

కైకలూరు: కైకలూరు శ్రీశ్యామలాంబ ఆలయంలో శరన్నవరాత్రులు శమీపూజతో ముగిశాయి. ప్రతి రోజూ అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలి రాగా ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఆలయ ఈవో వీఎన్‌కె శేఖర్, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు నిర్వహించారు. మండలంలోని ఆలపాడు, గోనెపాడు, వరహాపట్నం గ్రామాల్లో తెప్పోత్సవాన్ని శనివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. వరహాపట్నం, గోనెపాడు గ్రామాల్లో ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలపాడులో తొలిసారి తెప్పోత్సవాన్ని నిర్వహించారు. హంస వాహనాన్ని విద్యుద్దీపాలతో అలంకరించి, మేళతాళాల నడుమ భారీ బాణాసంచా మధ్య తెప్పోత్సవాన్ని కన్నులపండవగా జరిపారు. టీడీపీ నేతలు కొనకళ్ళ జగన్నాథరావు, వీరమల్లు నరసింహారావు, పోసిన పాపారావు గౌడ్, పెన్మెత్స త్రినాథరాజు, సర్పంచ్ కొప్పుల కృష్ణకుమారి, దుర్గమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: విజయదశమిని ముదినేపల్లి మండల ప్రజలు సంప్రదాయ బద్ధంగా జరుపుకున్నారు. ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్, కాగిత కృష్ణప్రసాద్ వణుదుర్రు గ్రామంలోని కనకదుర్గమ్మ ఆలయంలో పూజలు జరిపారు.



ముసునూరు, ఆగిరిపల్లిలో అమ్మవార్ల ఊరేగింపు

వాడవల్లి, బొమ్మినంపాడు వేడుకల్లో ఎమ్మెల్యే కామినేని పూజలు జరిపారు. పెయ్యేరులోని దుర్గమ్మ, గురజలోని రామలింగేశ్వరస్వామి, వడాలి జగన్నాథస్వామి ఆలయాల్లో ఈవో సింగనపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గ్రామస్థులు శమీ పూజ నిర్వహించారు. పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ వెంకట్ కుమార్ దంపతులు ఆయుధ పూజ నిర్వహించారు. ఆదివారం దేవపూడిలో శివపార్వతుల రథోత్సవం వైభవంగా జరిగింది. శ్రీహరిపురం గంగానమ్మ ఆలయం వద్ద గ్రామస్థులు నరకాసుర వధ నిర్వహించారు. పలు గ్రామాల్లో అమ్మవారి నిమజ్జనోత్సవాలను కోలాహలంగా నిర్వహించారు.

కలిదిండి: సంతోషపురంలో పూజలందుకున్న దుర్గమ్మను మేళతాళాలతో ఘనంగా ఊరేగించారు. మట్టగుంట దుర్గమ్మ ఆలయం వద్ద భక్తులకు భారీ అన్నసమారాధన నిర్వహించారు. దుర్గమ్మ ఊరేగింపుల్లో ఏఎస్ఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

మండవల్లి: మండవల్లిలోని శ్రీభ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయం, ఇంగిలిపాకలంక శివారు శ్రీరామ్‌నగర్‌లోని శివగుళకాలమ్మ ఆలయంలో అమ్మవార్లకు విశేష అలంకారాలు చేశారు. లోకుమూడి దత్తాశ్రమంలో 9 రోజులు పాటు కోటి కుంకుమార్చన, చండీహోమం వివిధ అలంకరణల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



స్వామి, అమ్మవార్లను అట్టహాసంగా నిత్యకల్యాణ మండప వేదిక వద్దకు తీసుకొస్తున్న దృశ్యం (ఇన్‌సెట్) కల్యాణమూర్తులు

వరుడైన చిన్న తిరుమలేశుడు

ఘనంగా ప్రారంభమైన ఆశ్వయుజ బ్రహ్మోత్సవాలు

ద్వారకాతిరుమల, అక్టోబరు 13: ముగ్ధమంద హాసంతో శ్రీదేవి, భూదేవీల నడుమ కొలువైన చిన్నతిరుమలేశుడు పెండ్లి కుమారునిగా ముస్తాబయ్యారు. చిరునగవులు చిందిస్తూ.... అపురూపలావణ్యాలతో బుగ్గన చుక్కలు, పట్టు పీతాంబరాలను ధరించి విశేష అలంకారాల్లో కొలువైన ఉభయదేవేరులు పెండ్లి కుమార్తెలయ్యారు. అర్చకుల వేదమంత్రోచ్ఛరణలు, భక్తుల గోవిందనామ స్మరణలు, మేళతాళాలు, మంగళవాయిద్యాలు తోడైన వేళ.. ఈ అద్భుత వేడుకను వీక్షించిన భక్తజనులు పరవశించారు. శ్రీవారి ఆలయ నిత్యకల్యాణ మండప ఆవరణ ఆదివారం ఉదయం ఇందుకు వేదికైంది. ప్రత్యేకంగా అలంకరించిన ఈ వేదికపై ఏర్పాటు చేసిన సువర్ణ సింహాసనంపై స్వామి, అమ్మవార్ల కల్యాణమూర్తులను ఉంచి ఆలయ అర్చకులు హారతులిచ్చి ఈ తంతును వేదవిద్యార్థుల మంత్రోచ్ఛరణల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ఈవో ఎస్వీఎస్ఎన్ మూర్తి పాల్గొని అర్చకులు, పండితులకు దీక్షా వస్త్రాలను అందచేసి, ఆ తరువాత స్వామివారి తీర్థ, ప్రసాదాలను స్వీకరించారు.

శ్రీమహావిష్ణువుగా చినవెంకన్న



ద్వారకాతిరుమల, అక్టోబరు 13: శ్రీమహా విష్ణువుగా చిన వెంకన్న భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీవారి ఆశ్వయుజ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీవారు ప్రతీ రోజూ ఓ ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తారు, ఇందులో తొలిరోజైన ఆదివారం శంఖు, చక్ర గదాధారియై ఉభయదేవేరులతో విశేష పుష్పాలంకారాల్లో మహా విష్ణువు అలంకారంలో ఉన్న స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించి తరించారు.

రామాలయ పునర్నిర్మాణానికి కామినేని శంకుస్థాపన



కలిదిండి, అక్టోబరు 13 : కోరుకొల్లు యాదవ పాలెంలో రామాలయం పునర్నిర్మాణానికి ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు వలవల రామారావు, చెన్నంశెట్టి మురళీకృష్ణ, నియోజకవర్గ టీడీపీ తెలుగుయువత ప్రధాన కార్యదర్శి నున్న సుబ్రహ్మణ్యం, బీజేపీ నాయకులు కేశిరెడ్డి బలరామ్, చెన్నంశెట్టి శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తల్లి మరణాన్ని తట్టుకోలేక కుమారుడి మృతి



వెంకటేశ్వరరావు(ఫైల్)

పెదవేగి, అక్టోబరు 13 : వృద్ధాప్యంతో మృతి చెందిన తల్లికి కర్మకాండలు పూర్తి చేసి కుమారుడు రోజు గడవకముందే గుండె ఆగి మరణించాడు. ఒక రోజు వ్యవధిలో తల్లీకుమారులు మృతిచెందడంతో ఆ గ్రామంలో విషాదం నెలకొంది. వివరాల్లోకి వెళ్తే.. పెదవేగి మండలం కూచింపూడికి చెందిన ఏను గు గంగమ్మ(80) శుక్రవారం ఉదయం మృతి చెందింది. ఆమె కుమారుడు వెంకటేశ్వరరావు అంత్యక్రియలు నిర్వహించాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన ప్పటి నుంచి ఎవ్వరితోనూ మాట్లాడకుండా మౌనంగా రోదిస్తున్నాడు. ఆ రాత్రి నిద్రించిన వెంకటేశ్వరరావు శనివారం ఉదయం గుండెపోటుకు గురై మృతిచెందాడు. దీంతో గ్రామంలో విషాదం నెలకొంది. రోజు వ్యవధిలో తల్లీ, కుమారుడు మృతి చెందడంతో బంధువులు విషాదంలో మునిగారు. చిన్న తనం నుంచి తల్లి గంగమ్మ అంటే ఎనలేని ప్రేమను పెంచుకున్న కుమారుడు వెంకటేశ్వరరావు(50) తల్లి మృతిని జీర్ణించుకోలేక గుండెపోటుకు గురై మృతి చెందా దని గ్రామస్తులు తెలిపారు. వెంకటేశ్వరరావు నాలుగేళ్ళ వయస్సులోనే తండ్రిని కోల్పోగా, అప్పటినుంచి తల్లీకుమారుడు ఒకరి కొకరుగా జీవించారని, వెంకటేశ్వర రావుకు పెళ్ళై, ఇద్దరు పిల్లలకు తండ్రి అయినా.. తల్లితో తన అనుబంధాన్ని వీడలే దని, ఇప్పటికీ తల్లి మాటే వేదంగా ఉండేవాడని గ్రామస్తులు తెలిపారు. అలాంటి తల్లి వృద్ధాప్యంతో మృతి చెందినా ఆ నిజాన్ని తట్టుకోలేక తెల్లారే సరికి తల్లి దగ్గరకే వెళ్ళాడని గ్రామస్తులు విచారం వ్యక్తం చేస్తున్నారు.

వివాహితను వేధిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు

ముసునూరు, అక్టోబరు 13: వివాహితను వేధింపులకు గురిచేస్తున్న ఇద్దరు వ్యక్తులపై శనివారం రాత్రి కేసు నమోదు చేసినట్టు ముసునూరు ఎస్ఐ ఎం.చిరంజీవి తెలిపారు. మండలంలోని అక్కిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన వివాహితకు అదే గ్రామానికి చెందిన జంధ్యాల రాంబాబు, నాగరాజు కొద్ది రోజులుగా ఫోన్‌చేసి అసభ్యకరంగా వేధిస్తున్నారని బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేటి నుంచి పల్లె పండుగ

అధ్వాన రహదారులకు మోక్షం

కైకలూరు నియోజకవర్గానికి రూ. 19.45 కోట్లు

నేటి నుంచి పనులకు శ్రీకారం

వైసీపీ హయాంలో మరమ్మతులకు కూడా నోచుకోని పల్లె రహదారులకు మహర్దశ రానుంది. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు నుంచే అభివృద్ధి వైపే పయనిస్తామని చెప్పినట్టుగానే రాష్ట్ర వ్యాప్తంగా పల్లె రహదారులపై ప్రత్యేక దృష్టి పెట్టి సుమారు రూ. 2200 కోట్ల నిధులు కేటాయించింది. ఈ నిధులతో నిర్మించే రహదారులకు పల్లె పండుగ పేరుతో సోమవారం నుంచి శంకుస్థాపన కార్యక్రమాలు పెద్దఎత్తున నిర్వహించనున్నారు.

కైకలూరు, అక్టోబరు 13: కైకలూరు నియోజకవర్గంలో 254 రహదారుల సీసీ రోడ్ల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం రూ. 19 కోట్ల 45 లక్షల నిధులను మంజూరు చేసింది. వీటిలో కైకలూరు మండలంలో 66 పనులకు గాను రూ. 4 కోట్ల 59 లక్షలు, కలిదిండి మండలానికి 60 పనులకు గాను రూ. 5 కోట్ల 81 లక్షలు, ముదినేపల్లి మండలానికి 61 పనులకు గాను రూ. 4 కోట్ల 49 లక్షలు, మండవల్లి మండలానికి 67 పనులకు గాను రూ. 4 కోట్ల 57లక్షలు నిధులను కేటాయించారు. ఈ పనులను మార్చి లోపు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. కైకలూరు నియోజకవర్గంలో దాదాపు 110 గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు చేయగా ప్రభుత్వం మంజూరు



చేయడంతో పల్లెరోడ్ల రూపురేఖలు మారనున్నాయి. ముందుగా ప్రతిపాదనలు చేసిన రోడ్లకు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ సోమవారం శంకుస్థాపన చేయనున్నారు. ఇప్పటికే అధికారులు శిలాఫలకాలను ఏర్పాటు చేయడంతో పాటు రహదారి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. రహదారుల అభివృద్ధి పనులు చేపట్టడంతో కూటమి నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత ఐదేళ్ళు గ్రామానికి వచ్చి 100 మీటర్ల రహదారి నిర్మాణం కూడా చేయలేదని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలల్లోనే నియోజకవర్గానికి రూ. 19.45 కోట్లు నిధులు కేటాయించడంతో తమ గ్రామాలకు మంచి రోజులు వచ్చాయని సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.


ముదినేపల్లి: మండలంలోని 32 గ్రామ పంచాయతీల్లో అంతర్గత రహదారుల నిర్మాణాలకు శ్రీకారం చుట్టనున్నారు. సోమవారం దాకరం, పేరూరు గ్రామాల్లో శంకుస్థాపనలు చేయనున్నారు. మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ కామినేని పెదపాలపర్రు, వడాలి, ముదినేపల్లి గ్రామాల్లో సుమారు రూ.45 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. ఈ నెల 20 వరకు జరిగే పండుగ వాతావరణంలో నిర్వహించేందుకు ఎన్డీఏ నాయకులు కూడా సమాయత్తమవుతున్నారు.



నూజివీడులో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

పశువైద్యులను నియమించండి: మంత్రి సారథి

నూజివీడు, అక్టోబరు 13: పాడి పశువుల ఆరోగ్య పరిరక్షణకు నూజివీడు పశువుల ఆసుపత్రిలో వైద్యులను నియమించాలని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి, పశు సంవర్ధక శాఖ జేడీని ఆదేశించారు. నూజివీడు మండలం పల్లెర్లమూడిలో ఆదివారం పలు కార్యక్రమాల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలో పశుసంపద ఎక్కువగా ఉందని, పశువులకు చర్మసంబంధ వ్యాధులు సోకి చనిపోతున్నాయని, వాటికి మెరుగైన వైద్యం అందించాలని గ్రామస్థులు మంత్రిని కోరారు. దీనిపై మంత్రి స్పందిస్తూ తక్షణం వైద్యులను నియమించాలని ఆదేశించారు. అనంతరం రైతు భరోసా, విలేజ్ హెల్త్ క్లినిక్, సచివాలయాలు, మధ్యలో నిలిచిపోయిన విషయాన్ని గ్రామస్థులు మంత్రి దృష్టికి తీసుకువెళ్ళగా భవనాలను తక్షణం పూర్తిచేయాలని మంత్రి సూచించారు. టీడీపీ నాయకులు అట్లూరి రమేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

అ'పూర్వ' సమ్మేళనం

నూజివీడు టౌన్, అక్టోబరు 13: నూజివీడు ఎస్.ఆర్.ఆర్. బాలుర ఉన్నత పాఠశాల 1977-78 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం నూజివీడు జీపీ గ్రాండ్‌లో ఆనందోత్సాహాల మధ్య సాగింది. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయిలో వివిధ హోదాల్లో పనిచేసి రిటైర్ అయిన ఉద్యోగులకు పూర్వ విద్యార్థులు సన్మానించారు. నూజివీడు ఎస్.ఆర్.ఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించి రాష్ట్ర ఇంటెలిజెన్స్ డీజీగా పనిచేసి రిటైరైన ఏ.బి వెంకటేశ్వరరావు, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్‌గా రిటైరైన గిరిధర్, జీఎస్వీ ప్రసాద్‌లను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. మిర్యాల అప్పలరాజు, మాజీ డీసీ చైర్మన్ లావునాగ వరప్రసాద్, ఇతర పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కామినేని, పరిశీలకుడు సాంబిరెడ్డి

ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుపై దృష్టి సారించాలి

కైకలూరు/కలిదిండి, అక్టోబరు 13: అర్హత కల్గిన పట్టభద్రులందరికీ ఓటు హక్కును కల్పించేలా కూటమి నాయకులు కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్, కైకలూరు నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు బి. సాంబిరెడ్డి అన్నారు. ఆదివారం వరహాపట్నంలోని తన నివాసంలో కూటమి నాయకులతో నిర్వహించిన సమావేశంలో కామినేని మాట్లాడుతూ 2021 జనవరి నాటికి డిగ్రీ పూర్తయిన ప్రతి ఒక్కరికి పట్టభద్రుల ఓటు హక్కు కల్పించాలన్నారు. కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ పోటీ చేస్తారని ఆయన గెలుపునకు కూటమి నేతలంతా కృషి చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, కోకన్వీనర్లు బొమ్మనబోయిన విజయలక్ష్మి, కొడాలి వినోద్, బలే ఏసురాజు, కూటమి నాయకులు పెన్మెత్స త్రినాథరాజు, పోకల జోగిరాజు, నారగాని నాగేశ్వరరావు, వల్లభనేని శ్రీనివాస చౌదరి, కోటప్రోలు కృష్ణారావు, పూల రామచంద్రరావు, కొల్లి వరప్రసాద్, నల్లగోపుల చలపతి, కాళ్ళపాలెం బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

గౌతు లచ్చన్న విగ్రహం ఏర్పాటుకు శంకుస్థాపన



నూజివీడు టౌన్/చాట్రాయి, అక్టోబరు 13: స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహం ఏర్పాటుకు ఆదివారం నూజివీడు బస్టాండు సెంటర్లో గౌడ సంఘ నాయకులు మరీదు శివరామకృష్ణ, మారగాని నారాయణ తదితరులు శంకుస్థాపన చేశారు. ఆరేపల్లి శ్రీనివాసరావు, పామర్తి నాగేంద్రం, చలమాల వెంకటేశ్వరరావు, చల్లారి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు. చాట్రాయి మండలం నుంచి నియోజకవర్గ గౌడ సంఘం అధ్యక్షుడు కందుల కృష్ణ, సర్పంచ్ మిద్దె శివాజీ, మాజీ సర్పంచ్ పలగాని దుర్గారావు, నాయకులు మాదాసు చంద్రకళ, పానుగళ్ళ కోటేశ్వరరావు, వంగల సుబ్బారావు, ఈడా శ్రీను, మరీదు శ్రీను, నాగార్జున తరలి వెళ్లారు.

బాబా సమాధి పూజ



సింగన్నగూడెం బస్టాప్ వద్ద మందిరంలో బాబా

ముసునూరు, అక్టోబరు 13: విజయదశమి రోజు బాబా సమాధిలోకి వెళ్ళిన రోజు అయినందున అక్కిరెడ్డిగూడెంలోని శిర్డిసాయి ఆలయంలో స్వామివారి సమాధి పూజను వైభవంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ పోలవరపు నరసింహారావు ఆధ్వర్యంలో అర్చకులు దీపక్ పాండ్యే బాబా సమాధి పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

ఆగిరిపల్లి: సింగన్నగూడెం బస్టాప్ సమీపంలో గల బాబా ఆలయంలో సమాధి ఉత్సవాలు గోపాలపురానికి చెందిన కంభంపాటి శ్రీనివాస్ నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు. భక్తులు విశేషంగా తరలివచ్చినట్టు ప్రధాన అర్చకులు దేవులపల్లి మూర్తి తెలిపారు.

అద్దాల మండపం ప్రారంభం



ముదినేపల్లి, అక్టోబరు 13 : ముదినేపల్లి మండలం శ్రీహరిపురంలోని షిర్డి సాయిబాబా మందిరంలో సుమారు రూ.10 లక్షల విరాళాలతో నిర్మించిన అద్దాల మండపాన్ని విజయదశమి నాడు మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ నాయకుడు కమ్మిలి విఠల్ రావు ప్రారంభించారు. అనంతరం విఠల్ రావు దంపతులు పూజలు నిర్వహించారు. టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, మందిర చైర్మన్ పరసా ఏడుకొండలు, సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు, మందిర వైస్ చైర్మన్ నీలం నరసింహారావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

హోరాహోరీగా చెడుగుడు పోటీలు



నూజివీడు టౌన్, అక్టోబరు 13: దసరా ఉత్సవాలను పురస్కరించుకుని నూజివీడు డీఏఆర్ కళాశాలలో అఖిల భారత చెడుగుడు పోటీలను నూజివీడు స్పోర్టింగ్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ప్రారంభించారు. ఐదు పురుష జట్లు, ఐదు మహిళా జట్లు హాజరు కాగా, తొలిరోజు క్రీడా పోటీలు నువ్వా నేనా అనేలా సాగాయి. తొలిరోజు పురుషజట్ల మధ్య రెండు క్రీడాపోటీలను నిర్వహించగా, తొలి చెడుగుడు పోటీల్లో కృష్ణ, పశ్చిమగోదావరి జట్లు తలపడ్డాయి. ఇందులో 51-22 స్కోరుతో పశ్చిమగోదావరిపై కృష్ణాజట్టు గెలుపొందగా ఇక రెండో క్రీడాపోటీ విజయనగరం, శ్రీకాకుళం జట్ల మధ్య సాగింది. 38-35 స్కోరుతో శ్రీకాకుళంపై విజయనగరం జట్టు విజయం సాధించింది. అనంతరం నిర్వహించిన మహిళా చెడుగుడు పోటీల్లో శ్రీకాకుళం, గుంటూరు జట్లు తొలుత పోటీ పడ్డాయి. ఇందులో 33-20 స్కోరుతో గుంటూరుపై శ్రీకాకుళం విజయం సాధించగా, 2వ పోటీ కృష్ణా, విజయనగరం జట్ల మధ్య జరుగగా 22-35 స్కోరుతో కృష్ణాపై విజయనగరం విజయం సాధించింది. ఇక రెండో రోజు క్రీడా పోటీలు వర్షం కారణంగా దాదాపు 2 గంటలు ఆలస్యంగా ప్రారంభం అయ్యాయి.

జనార్దనవరం వీఆర్ఏ మృతి

చాట్రాయి, అక్టోబరు 13: మండలంలోని జనార్దనవరం వీఆర్ఏ ఆడిమెల్లి సుబ్బారావు (70) ఆదివారం మృతి చెందారు. కరణాల వ్యవస్థలోను, తరువాత రెవెన్యూలోను సుమారు 50 ఏళ్లుగా ఈయన వీఆర్ఏగా పనిచేస్తూ ప్రజల అభిమానాన్ని చూరగొన్నారు. ఆడిమెల్లి సుబ్బారావు భౌతికకాయాన్ని పలు గ్రామాల వీఆర్ఏలు, రెవెన్యూ సిబ్బంది సందర్శించి నివాళుల ర్పించారు.

5 లిక్కర్ షాపులకు 128 దరఖాస్తులు

ముదినేపల్లి, అక్టోబరు 13: ముదినేపల్లి మండలంలోని ఐదు లిక్కర్ షాపులకు 128 దరఖాస్తులు అందాయి. మండలంలోని ముదినేపల్లిలో రెండు, అల్లూరులో ఒకటి, సింగరాయపాలెంలో ఒకటి, వణుదుర్రులో ఒక షాపును ఏర్పాటు చేశారు. దరఖాస్తు ఫీజుగా రూ.2 కోట్ల 56 లక్షల ఆదాయం వచ్చింది. సోమవారం షాపుల కేటాయింపునకు ఏలూరులో లాటరీ నిర్వహిస్తారు.